ఆలోచన అదిరే.. విజయం దరిచేరే

డ్రోన్ హ్యాకథాన్‌లో మెరిసిన ఐఐటీ విద్యార్థులు

ప్రాణాపాయంలో చేయూత

ఆవిష్కరణ: రియల్ టైం పీపుల్ ట్రాకింగ్ ఇన్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్

బృందం: డా.సి.హెచ్.విష్ణు (అసిస్టెంట్ ప్రొఫెసర్), ఆయుష్ బిశ్వాల్, హరియోమ్ మీనా, దీపక్ యాదవ్ (ఎంటెక్, సీఎస్ఈ), శుభం కుమార్ (మాస్టర్స్ రిసెర్చ్, సీఎస్ఈ)



ఉపయోగమిలా: వరదలు సంభవించినప్పుడు ఆ వరదల్లో మునిగిపోతున్న మనుషులు, వాహనాలు, జంతువులు ఇలా వేర్వేరుగా గుర్తించడం కష్టం. కొన్ని సందర్భాల్లో మనుషులు అనుకొని వస్తువులను దక్కించుకోవడంతో ప్రాణనష్టం తీవ్రంగా ఉంటుంది. అలాంటి ఘటనలకు చెక్ పెట్టేందుకు 'రియల్ టైం పీపుల్ ట్రాకింగ్ ఇన్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్' ఆవిష్కరణ ఉపయోగపడనుంది. ఇతర డ్రోన్లు వరదల్లో కొట్టుకుపోయిన సగం మాత్రమే కనిపించే వ్యక్తులను గుర్తించలేవు. ఈ ఆవిష్కరణ మాత్రం సగం శరీరం కనిపించే వ్యక్తులను సైతం గుర్తించి సమాచారాన్ని చేరవేస్తుంది. వ్యక్తుల ప్రాణాలను కాపాడటంలో ముందుంటుంది.





ఈనాడు డిజిటల్, తిరుపతి: బుల్లి డ్రోన్లు అద్భుతాలకు వేదికవుతున్నాయి. వాటిలో వస్తున్న ఆవిష్కరణలు మానవాళి అవసరాలకు ఆయువుపట్టుగా నిలుస్తున్నాయి. తిరుపతి ఐఐటీ వాటికి వేదికవుతున్నాయి. అమరావతిలో రెండు రోజులపాటు జరిగిన డ్రోన్ సమ్మిట్‌లో తొలిరోజే రాణించి బహుమతి అందుకుంది. విపత్తులు, అత్యవసర సేవలు, మారుమూల ప్రాంతాలకు మందుల చేరవేత, రవాణా కేటగిరిలో 67.2 పాయింట్లు సాధించి ద్వితీయ విభాగంలో తృతీయ బహుమతి కింద రూ.50,000 గెలుచుకోగా.. ఇతర ఆవిష్కరణలు ఇలా ప్రత్యేకత చాటుతున్నాయి.

విపత్తుల్లోనూ సిగ్నళ్లు

ఆవిష్కరణ: ఏరియల్ బేస్ స్టేషన్ టు రీస్టోర్ నెట్‌వర్క్

బృందం: డా.సర్వేంద్రనాథ్ (అసిస్టెంట్ ప్రొఫెసర్), శామ్యూల్ మర్కని (డ్రోన్ హబ్ డైరెక్టర్), విమలన్ (సిస్టమ్ ఇంజినీర్), అక్షయ్ (డెవలప్‌మెంట్ ఇంజినీర్)



ఉపయోగమిలా: భారీ వర్షాలకు విద్యుత్తు అంతరాయం ఏర్పడటం, స్తంభాలు విరిగిపడటంతోపాటు సిగ్నలింగ్ వ్యవస్థ పూర్తిస్థాయిలో దెబ్బతింటుంది. ప్రమాదంలో ఉన్నవాళ్లను కాపాడే వివరి అవకాశం ఉన్నా ఆ సందర్భంలో కోల్పోతారు. అలాంటి ఘటనల్లో ప్రాణనష్టం జరగకుండా చూసేందుకు ఈ తరహా డ్రోన్ ఆవిష్కరణ చేశారు. ఇందుకు రెండు రకాల డ్రోన్లను ఏరియల్ బేస్ స్టేషన్‌లో ఉపయోగిస్తారు. మొదటిది బ్యాటరీ సాయంతో దాదాపు మూడు గంటలపాటు తాత్కాలిక సిగ్నల్స్ సరఫరా చేస్తుంది. రెండోది తీగల సాయంతో దాదాపు 24 గంటలపాటు గాలిలోనే సిగ్నల్ వ్యవస్థను మోసుకెళ్తుంది. వీటిద్వారా ఎస్ఓఎస్ ప్రక్రియ నడుస్తుంది. సిగ్నల్ ఆధారంగా ప్రమాదంలో ఉన్నవాళ్లను రక్షించొచ్చు. విజయవాడ డ్రోన్ హబ్, తిరుపతి ఐఐటీల భాగస్వామ్యంలో దీన్ని ఆవిష్కరించారు. ఈ ఆవిష్కరణ తొలిరోజే తృతీయ బహుమతి గెలుచుకుంది.

రైతుకు రక్షకుడిలా..

ఆవిష్కరణ: క్రాప్ హెల్త్ ప్రిడిక్షన్ అండ్ ఫెయిల్యూర్ అలర్ట్

ఉపయోగమిలా: అమెరికా, యూరప్ వంటి దేశాల్లో డ్రోన్లను ఉపయోగించే వ్యవసాయం చేస్తారు. పంట వేసే సమయం నుంచి చేతికొచ్చేవరకు డ్రోన్ రక్షకుడిలా కాపలా కాస్తుంది. పంట రోగాలను గుర్తించి రైతుకు సమాచారమిస్తుంది. అలాంటి ఆవిష్కరణే ఇక్కడా చేయాలనే సంకల్పంతో ఈ ఆవిష్కరణ చేశారు. పంటను ఆశించే రోగాలను 30 రోజుల ముందే కనిపెట్టడం ఈ డ్రోన్ పని. నేరుగా నిర్దేశిత పంటను చేరుకొని పని కానిచ్చే రైతుకు అండగా సేవలు అందిస్తుంది.

వరదల్లో చిక్కుకున్న వారికి..

ఆవిష్కరణ: డిటెక్షన్ ఆఫ్ పర్సన్ ఫ్రం డ్రోన్ ఫుటేజ్

బృందం: రామకృష్ణ సాయి, (ప్రాజెక్ట్ సర్), వినాయక్ నగేలి (సొల్యూషన్ డిజైనర్), గణేశ్ (డెవలపర్), దీపక్ యాదవ్ (పీజీ)

ఉపయోగమిలా: ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ప్రజలను కాపాడేందుకు అధికారులు చర్యలు తీసుకోవడం సర్వసాధారణం. ప్రమాదంలో చిక్కుకున్న వాళ్లను కాపాడాలంటే ముందుగా వాళ్లు ఎక్కడ ఉన్నారనేది గుర్తించాలి. అలాంటి పనిని ఈ డ్రోన్ చేస్తుంది. డ్రోన్ సాయంతో పైనుంచి గాలింపు చర్యలు చేపట్టినా కింద ఉన్నవారు చిన్నగా కనిపించడంతో వాళ్లను గుర్తించడం కష్టంగా మారుతోంది. అలాంటి సమయంలో వీరు రూపొందించిన డ్రోన్ వీడియో తీసి నేరుగా అధికారులకు సమాచారం చేరవేస్తుంది. వాళ్ల ముఖాలను స్కాన్‌చేసి గుర్తిస్తుంది. వరదల్లో చిక్కుకున్న వాళ్లను రక్షించేందుకు ఇది ఉపయోగకరంగా ఉంటుంది.



'డిటెక్షన్ ఆఫ్ పర్సన్ ఫ్రమ్ డ్రోన్ ఫుటేజ్' డెమో

మొరాయించిన సర్వర్.. తప్పని నిరీక్షణ



ఎల్ఎల్ఆర్ పరీక్షల కోసం వేచి ఉన్న ప్రజలు

తిరుపతి (నేరవిభాగం): లెర్నర్ లైసెన్స్ రిజిస్ట్రేషన్ (ఎల్ఎల్ఆర్) పరీక్ష నిమిత్తం తిరుపతి డీటీవో కార్యాలయానికి బుధవారం వచ్చిన ప్రజలకు ఎదురు చూపులు తప్పలేదు. సర్వర్ మొరాయించడంతో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు వేచి ఉన్నారు. మోటారు వాహన ఇన్‌స్పెక్టర్ పర్యవేక్షణలో వారికి పరీక్షలు నిర్వహించాల్సి ఉండగా బుధవారం 60 మంది వచ్చారు. ఒక దేశం.. ఒక యాప్ పేరుతో దేశవ్యాప్తంగా రవాణా శాఖ సేవలను ఏకీకృతం చేశారు. వాహన పోర్టల్ ద్వారా సర్వీసులు.. సారథి వెబ్‌సైట్ ద్వారా సర్వర్ సేవలు అందిస్తున్నారు. దిల్లీ కేంద్రంగా నడిచే సర్వర్ పనిచేయకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఎంతకూ రాకపోవడంతో కొందరు వెనుదిరిగారు. ఈ విషయంగా డీటీవో మురళీ మోహన్‌ను సంప్రదించగా.. సర్వర్ సమస్య గురించి ఉన్నతాధికారులకు నివేదించామని తెలిపారు.

గడువు తీరిన చిక్కీలపై విచారణ

తిరుపతి (బైరాగిపట్టెడ): పాకాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 'కాలం చెల్లిన చిక్కీలు' అనే శీర్షికన బుధవారం 'ఈనాడు'లో వార్త ప్రచురితం కావడంతో కలెక్టర్ వెంకటేశ్వర్ విచారణ చేపట్టాలని డీఈవో వి.శేఖర్‌ను ఆదేశించారు. ఆయన మండల విద్యాశాఖ అధికారులు లింగయ్య, బాబ్జీలతో కలిసి పాఠశాలలోని చిక్కీలు నిల్వ ఉంచిన పెట్టెలను పరిశీలించారు. పది అట్టపెట్టెల్లో ఆగస్టు మాసంలో సరఫరా చేసిన చిక్కీలు ఉన్నట్లు గుర్తించారు. అయితే వాటిని విద్యార్థులకు సరఫరా చేయలేదని, సెప్టెంబరులో సరఫరా చేసిన చిక్కీలు మాత్రమే విద్యార్థులకు అందించినట్లు కలెక్టర్‌కు ఇచ్చిన నివేదికలో విద్యాశాఖ అధికారులు పేర్కొన్నారు. ఈ అంశంపై సంబంధిత సరఫరాదారుకు నోటీసులు ఇచ్చి వివరణ కోరినట్లు ఓ ప్రకటనలో జిల్లా విద్యాధికారి వెల్లడించారు. పాకాల ఉన్నత పాఠశాల హెచ్ఎం నుంచి వివరణ కోరినట్లు పేర్కొన్నారు.



చుట్టేసిన జలం..
చక్కదిద్దుకోలేని కాపురం

పాడిపేట నుంచి గాజుల మండ్యంకు వెళ్లే మార్గంలోని జగనన్న కాలనీ ఇది. సూరప్పకశం వద్ద నగర లబ్ధిదారులు వెయ్యిమందికి గృహాలు కేటాయించారు. కొన్ని ఇళ్లు పూర్తవగా చాలావరకు నిర్మాణ దశలోనే ఉన్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు ఇళ్ల చుట్టూ వర్షంనీరు చేరి మడుగులా మారింది. రహదారి అస్తవ్యస్తంగా ఉంది. పరిసరాల్లో పిచ్చిమొక్కలు పెరిగి పెద్దవయ్యాయి. అధికారులు స్పందించి పరిష్కారం చూపాలని లబ్ధిదారులు కోరుతున్నారు. **- ఈనాడు, తిరుపతి**

అయ్యో అన్నపూర్ణమ్మ

ఈనాడు-తిరుపతి: కూలీనాలి చేసుకుంటూ.. నోరు కట్టుకుని.. రెక్కల కష్టంతో కొంత సొమ్ము కూడబెట్టుకుంది ఓ వృద్ధురాలు. రేకుల ఇల్లు కట్టుకుని తలదాచుకుంది. మిగిలిన జీవితాన్ని అందులో వెల్లదీద్దామనుకుంది. కానీ అకస్మాత్తుగా, అన్యాయంగా ఆమె గూడును కూల్చివేయడంతో తన గోడు ఎవరికి చెప్పుకోవాలో తెలియక బిక్కచూపులు చూస్తోంది.

అధికారుల నుంచి ముందస్తు సమాచారం లేకుండానే ఓ వృద్ధురాలి ఇంటిని కూల్చేసిన ఘటన ఏర్పేడు మండలం గోవిందవరం ఎస్టీ కాలనీలో బుధవారం చోటుచేసుకుంది. బాధితురాలు అన్నపూర్ణమ్మ కథనం మేరకు.. 2008లో ప్రభుత్వం ఇంటి పట్టా మంజూరు చేయడంతో రేకుల ఇంటిని నిర్మించుకుని జీవనం సాగిస్తున్నారు. మంగళవారం పంచాయతీ కార్యదర్శి షఫీ ఇంటికి వచ్చి చెరువు పోరంబోకు స్థలంలో ఇల్లు ఉందని అధికారులను కలవాలని సూచించారు. ఆమె పట్టాను చూపించడంతో వెనుదిరిగారు. బుధవారం స్థానికంగా కొందరితో కలసి వచ్చిన పంచాయతీ కార్యదర్శి ఇంటిని కూల్చేశారు. సామగ్రిని బయటకు తీసుకునేంత సమయం కూడా ఇవ్వలేదని ఆమె విలపించారు.

పట్టా ఉన్నా ఇల్లు కూల్చివేత

ఎన్నికల సమయంలో కుమారుడికి స్థానిక నేతల మధ్య వివాదం చోటుచేసుకోవడంతో కక్ష సాధింపులో భాగంగానే కూల్చేశారని అన్నపూర్ణమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. చెరువు పోరంబోకు స్థలం ఆక్రమణలు జరిగి ఉంటే రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలి. ఇవేవీ చేయకుండానే పంచాయతీ కార్యదర్శి ఇంటిని తొలగించడం చర్చనీయాంశమైంది. తహసీల్దార్ భార్గవిని వివరణ కోరగా.. దీనిపై తమకు, ఎంపీడీవోకు సమాచారం లేదని, ఇల్లు తొలగించాలని ఎవరికీ ఆదేశాలు జారీ చేయలేదని స్పష్టం చేశారు.



కూలగొట్టిన ఇంటి వద్ద అన్నపూర్ణమ్మ





వంటకాలతో అదరగొట్టి..

రేణిగుంట, న్యూస్‌టుడే: అంతర్జాతీయ చెఫ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక పాకశాస్త్ర కళాశాలలో విద్యార్థులకు పలు వంటకాలపై పోటీలు నిర్వహించారు. విద్యార్థులను మూడు జట్లుగా విభజించి పోటీలు నిర్వహించగా.. వారు తమ వంటకాలతో ఆహూతులను మెప్పించారు. కార్యక్రమంలో తిరుపతి తాజ్ హోటల్ బీఎం రితేష్‌చౌదరి, స్కల్ ఇంటర్నేషనల్ ఉపాధ్యక్షులు కమలేశ్వర్, సుశీంద్రన్, ఫార్చ్యూన్ గ్రాండ్ రిడ్జ్ హోటల్ హెచ్ఆర్ డైరెక్టర్ రంజిత్, పాకశాస్త్ర ప్రిన్సిపల్ త్రిలోక చందర్ తదితరులు పాల్గొన్నారు.

షార్ సందర్శనకు దేశవ్యాప్త విద్యార్థులు



షార్‌లోని బ్రహ్మ ప్రకాష్ హాలులో విద్యార్థులు

శ్రీహరికోట, న్యూస్‌టుడే: దేశంలోని నలుమూలాల నుంచి విద్యార్థులు బుధవారం సతీశ్ ధవన్ స్పేస్ సెంటర్ షార్ సందర్శనకు వచ్చారు. జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని పురస్కరించుకుని కేంద్ర శాస్త్ర, సాంకేతిక మంత్రిత్వశాఖ, భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) ఈ ఏడాది ఆగస్టు 10 నుంచి సెప్టెంబరు 30 వరకు దేశ వ్యాప్తంగా వివిధ కార్యక్రమాలు చేపట్టి, విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో దేశ వ్యాప్తంగా 3,66,308 మంది పాల్గొన్నారు. అందులో ప్రతిభ కనబరిచిన వంద మంది విద్యార్థులను ఎంపిక చేశారు. వారికి షార్ సందర్శనకు అవకాశం కల్పించారు. ఎంపికైన విద్యార్థులు షార్‌కు వచ్చి, ఇక్కడ మొదటి, రెండో ప్రయోగ వేదికలు, మిషన్ కంట్రోల్ సెంటర్‌తోపాటు, ఇతర వసతులు సందర్శించి, ఫిలింషో తిలకించారు. విద్యార్థులకు షార్ ఎంఎస్‌ఏ గ్రూపు డైరెక్టర్ పి.గోపికృష్ణ అన్ని ఏర్పాట్లు చేశారు.

సర్వదర్శనానికి ఆరు గంటలు

తిరుమల: శ్రీవారి సర్వదర్శనానికి ఎస్ఎస్‌డీ టోకెన్లు లేకుండా బుధవారం సాయంత్రానికి క్యూలైన్లలో వచ్చిన భక్తులు వైకుంఠం క్యూకాంప్లెక్స్-2లోని 7 కంపార్ట్‌మెంట్లలో వేచిఉన్నారు. వీరికి దాదాపు 6 గంటల్లో శ్రీవారి దర్శనం లభించనుందని తితిదే తెలిపింది. రూ.300 ప్రత్యేక ప్రవేశదర్శనం టికెట్లు కలిగిన భక్తులు వైకుంఠం క్యూకాంప్లెక్స్-1లోని ఆరు కంపార్ట్‌మెంట్లలో వేచి ఉన్నారు. వీరికి మూడు గంటల్లో శ్రీవారి దర్శనం లభించనుంది. మంగళవారం శ్రీవారిని 64,359 మంది దర్శించుకోగా రూ.3.59 కోట్ల హుండీ కానుకలు లభించాయి.

ఇదేం తిరకాసు

మట్టి తవ్వని చెరువులకు నిధుల మళ్లింపు

అధికారుల తీరును తప్పుబడుతున్న రైతులు



ఏర్పేడు మండలంలోని అముదూరు చెరువు

శ్రీకాళహస్తి, ఏర్పేడు, న్యూస్‌టుడే: దేవుడు వరమిచ్చినా పూజారి కరుణ దక్కలేదన్నట్లుగా తయారైంది జలవనరుల శాఖ తీరు. చెరువుల్లో మట్టి తవ్వకాలకు మేఘా కంపెనీ జలవనరుల శాఖకు దాదాపుగా రూ.2.50 కోట్ల నిధులు ఇచ్చింది. వీటితో ఆయా చెరువులను అభివృద్ధి చేయాలి. అందుకు భిన్నంగా అధికారుల వ్యవహరించడాన్ని పలు చెరువుల ఆయకట్టు రైతులు తప్పుబడుతున్నారు. జిల్లాలోని శ్రీకాళహస్తి, గూడూరు పరిధిలో చెరువుల ఆధారంగా సాగు చేపట్టాల్సిన పరిస్థితి. వీటిలో నీటి నిల్వలుంటే రైతులకు పండగే. ఆరు వరుసల రహదారి అభివృద్ధి పనుల దృష్ట్యా సమీపంలోని చెరువుల్లో మట్టి తవ్వకాలు చేపట్టారు. ఇలా యాభైకి పైగా చెరువుల్లో మట్టిని తవ్వేశారు. అయితే నిర్దేశిత మోతాదుకు మించి ఆయా ప్రాంతాల్లోని వైకాపా నేతలు మట్టిని యథేచ్ఛగా తవ్వేసి జేబులు నింపుకొన్న ఘటనలు ఎన్నో ఉన్నాయి. వైకాపా పుణ్యమా అంటూ పలు చెరువుల రూపురేఖలు మారిపోయాయి.

ఉన్నతాధికారుల అనుమతితోనే పనులు

మట్టి తవ్వకాలు జరిగిన చెరువులతో పాటు రానున్న వర్షాల దృష్ట్యా కాస్తంత ప్రమాదకరంగా ఉన్న చెరువులకు తూములు, కట్ట పటిష్ఠీకరణ తదితర పనులకు నిధులు వ్యయం చేస్తున్నాం. ఆయకట్టు రైతులతో పాటు ఉన్నతాధికారుల అనుమతితోనే పనులు చేస్తున్నాం.

- ఆదినారాయణ, డీఈ, జలవనరుల శాఖ

అభివృద్ధిలోనూ చిన్నచూపేనా..

మేఘా రోడ్డు నిర్మాణ సంస్థ నిధులతో మట్టి తవ్విన చెరువులు కాకుండా ఇతర చెరువులకు నిధులు వ్యయం చేయడంపై రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మట్టి తవ్విన చెరువులకు తక్కువ మొత్తం కేటాయించడం, కనీసం తవ్వకాలు చేయని వాటికి నిధులు ఎక్కువగా మళ్లించడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. శ్రీకాళహస్తి మండలం మన్నవరం, ఏర్పేడు మండలం అముడూరు, తొట్టంబేడు మండలం కారాకొల్లు చెరువుల్లో మట్టి తీయకుండానే నిధులు మళ్లించడం గమనార్హం.

ప్రభుత్వం మారగానే.. రికార్డులు మార్చేశారా?

తిరుపతి(నేరవిభాగం): డిస్టిలరీల్లో అవకతవకలు వెలుగులోకి వస్తాయని ముందే ఊహించి కొన్ని రికార్డులు మాయం చేయడం.. మరికొన్ని మార్చేవేసినట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. తిరుపతి కరకంబాడి రోడ్డులోని ఎస్వీఆర్ డిస్టిలరీలో సీఐడీ డీఎస్పీ పద్మలత ఆధ్వర్యంలో రెవెన్యూ, ఎక్సైజ్, పోలీసు బృందాలు అర్ధరాత్రి వరకు సోదాలు చేపట్టాయి. డిస్టిలరీ ప్రతినిధుల నుంచి అన్ని ఆధారాలు సేకరించినట్లు సమాచారం. ఐదేళ్లలో ఎంత మేరకు మద్యం ఉత్పత్తి చేశారు.. ఏపీబీసీఎల్ డిపోలకు ఎంత సరఫరా చేశారు.. ఎంత నిల్వ ఉన్నది పరిశీలించగా తేడాలు గుర్తించినా.. కొన్ని దస్త్రాలు అందుబాటులో లేనట్లు సమాచారం. సరఫరాకు సంబంధించి రికార్డులు సక్రమంగా లేవని గుర్తించారు. మద్యం సీసాలకు వేసే సీళ్లను పరిశీలించారు.

రేపు పింఛన్ల సమస్యలపై అదాలత్

తిరుపతి (నగరం): ప్రభుత్వ ఉద్యోగులు, పదవీ విరమణ ఉద్యోగులకు సంబంధించి జీపీఎఫ్, పింఛన్ల సమస్యల పరిష్కారంపై శుక్రవారం కలెక్టరేట్‌లో అదాలత్ నిర్వహిస్తున్నట్లు జిల్లా ఖజానా అధికారి లక్ష్మీకరరెడ్డి తెలిపారు.

డిజిటల్ మార్కెటింగ్‌పై నేటి నుంచి శిక్షణ

మహిళా వర్సిటీ(తిరుపతి): శ్రీపద్మావతి మహిళా వర్సిటీ, యునైటెడ్ నేషన్స్ ఏషియన్ అండ్ పసిఫిక్ ట్రైనింగ్ సెంటర్ ఫర్ ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ ఫర్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో డిజిటల్ మార్కెటింగ్‌పై మూడు రోజులపాటు ఔత్సాహిక మహిళా పారిశ్రామికవేత్తలకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమం గురువారం ప్రారంభం కానుంది. వర్సిటీలోని ఇందిరా ప్రియదర్శిని ఆడిటోరియంలో ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి కలెక్టర్ వెంకటేశ్వర్, వీసీ ఉమ, యూఎన్ ఏపీసీ ఐసీటీ సంచాలకులు కియోంగ్‌జో ముఖ్య అతిథులుగా విచ్చేస్తారని నిర్వాహకులు దుర్గాభవాని, విజయలక్ష్మి తెలిపారు.



మొదటి ఘాట్‌రోడ్డులో రెండో ఘాట్‌రోడ్డులో

నిన్న అతుకులు నేడు గుంతలు

తిరుమల ఘాట్‌రోడ్లలో పలుప్రాంతాల్లో గుంతలు ఏర్పడ్డాయి. ఇటీవల శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలకు వాటికి మరమ్మతులు చేపట్టారు. తాజా వర్షాలతో పలు ప్రాంతాల్లో గుంతలు పడి వాహనదారులకు ఇబ్బందిగా మారుతున్నాయి. సంబంధిత అధికారులు దృష్టిసారించి పదుల సంఖ్యలో ఉన్న గుంతలకు మరమ్మతులు చేపట్టాలని భక్తులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, తిరుమల

ఆకులో ఆకునై..



అరుదైన జీవజాలానికి నిలయమైన శేషాచలం అడవులు ప్రకృతి ప్రేమికులను ఆకర్షిస్తున్నాయి. వాటి సంచారం తిరునగరిలోనూ అప్పుడప్పుడు కనిపిస్తోంది. స్థానిక సత్యనారాయణపురం పోస్టు పరిధిలోని విజయపురం వినాయక స్వామి ఆలయ వీధిలో మామిడి చెట్టు ఆకులో మిళితమైన గొంగళి పురుగు స్థానికులను ఇలా కనువిందు చేసింది. - ఈనాడు, తిరుపతి

ఎస్పీడీసీఎల్‌కు జాతీయస్థాయి పురస్కారం

తిరుపతి (నగరం), న్యూస్‌టుడే: విద్యుత్తు వినియోగదారులకు అత్యుత్తమ సేవలు అందిస్తున్న ఏపీ ఎస్పీడీసీఎల్‌కు జాతీయస్థాయిలో రెండో స్థానం దక్కించుకుంది. బుధవారం న్యూదిల్లీలో జరిగిన ఇండియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ (ఐసీసీ) ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సంస్థ ఛైర్మన్ అనిల్ రజ్దాన్ నుంచి డిస్కం తరఫున ప్రాజెక్టు డైరెక్టర్ ఆయూబ్‌ఖాన్ పురస్కారం అందుకున్నారు. సీఎండీ సంతోషరావు హర్షం వ్యక్తం చేస్తూ జాతీయ స్థాయిలో పురస్కారం వెనుక సంస్థ ఉద్యోగుల పాత్ర ఉందని కొనియాడారు.



ఐసీసీ ఛైర్మన్ అనిల్ రజ్దాన్ నుంచి పురస్కారం అందుకుంటున్న ఆయూబ్‌ఖాన్

సబ్ లీజుకు టెండర్ పిలవడంపై వివరణ కోరాం

ఈనాడు, అమరావతి: క్యాంటీన్ నిర్వహణ విషయంలో ఒప్పంద నిబంధనలు ఉల్లంఘించి సబ్ లీజు ఇచ్చేందుకు టెండర్ పిలవడంపై ఏపీ పర్యాటకాభివృద్ధి సంస్థ నుంచి వివరణ కోరినట్లు తిరుమల తిరుపతి దేవస్థానం తరఫు న్యాయవాది హైకోర్టుకు నివేదించారు. స్పందన కోసం వేచి చూస్తున్నామన్నారు. ఈ నేపథ్యంలో విచారణను వాయిదా వేయాలని కోరారు. అందుకు ధర్మాసనం అంగీకరించింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం ఈమేరకు ఉత్తర్వులు జారీచేసింది. తిరుమలలో క్యాంటీన్ నిర్వహణకు తితిదే నుంచి అనుమతి పొందిన ఏపీ పర్యాటకాభివృద్ధి సంస్థ.. దానిని సబ్ లీజుకు ఇచ్చేందుకు చేస్తున్న యత్నాన్ని సవాలు చేస్తూ సురవరం ప్రతాప్ రెడ్డి ఏపీ హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. సబ్ లీజ్ ఇవ్వడంపై నిషేధం ఉందన్నారు. ఇటీవల ఈ వ్యాజ్యంపై విచారణ జరిపిన ధర్మాసనం.. పూర్తి వివరాలు సమర్పించాలని తితిదే ఈవోను ఆదేశించించిన విషయం తెలిసిందే. బుధవారం ఈ వ్యాజ్యం హైకోర్టులో తాజాగా విచారణకు వచ్చింది. తితిదే తరఫు న్యాయవాది అభ్యర్థన మేరకు విచారణ వాయిదా పడింది.

బ్రాహ్మణులకు రుణమేళా మహోత్సవాలు

తిరుపతి(భవానీనగర్), న్యూస్‌టుడే : ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని బ్రాహ్మణ సామాజిక వర్గానికి చెందిన కార్యవర్గ సభ్యులు ఏపీ బ్రాహ్మణ కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్ రుణ మేళాను సద్వినియోగం చేసుకోవాలని సొసైటీ సభ్యుడు చిత్రపు హనుమంతరావు తెలిపారు. బుధవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. వ్యాపార, కుటుంబ అవసరాలకు తక్కువ వడ్డీతో రుణాలు పొందే అవకాశం ఉందన్నారు. దీపావళి, సంక్రాంతి తదితర పర్వదినాల్లో విరివిగా రుణాలను అందజేయాలని నిశ్చయించినట్లు వెల్లడించారు. శేషగిరిరావు, కుమార్, దాక్షాయణి, జయలక్ష్మి పాల్గొన్నారు.

భర్తను కడతేర్చిన భార్య..?

రేణిగుంట, న్యూస్‌టుడే: మండలంలోని చెంగారెడ్డిపల్లి గ్రామ ఎస్సీ కాలనీలో భర్తను భార్య హత్య చేసినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పట్టణ పోలీసుల కథనం మేరకు... చెంగారెడ్డిపల్లిలో కాపురం ఉంటున్న ఈశ్వరయ్య (43)కు సుజాతతో వివాహమై 15 ఏళ్లు గడుస్తోంది. వీరికి నలుగురు పిల్లలు ఉన్నారు. స్థానికంగా ఉన్న ప్రైవేట్ ఆస్పత్రిలో దంపతులు పనులు చేస్తున్నారు. భర్త ఈశ్వరయ్య మద్యానికి బానిస కావడంతో తరచూ వీరి మధ్య గొడవలు జరుగుతున్నాయి. మంగళవారం రాత్రి ఇంటి మిద్దెపై దంపతులిద్దరూ నిద్రిస్తుండగా.. గుర్తు తెలియని వ్యక్తులు ఈశ్వరయ్యను బండరాయితో మోదినట్లు భార్య సుజాత స్థానికులకు తెలిపింది. ఈశ్వరయ్యను ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. పట్టణ పోలీసులు జాగిలాలతో వెళ్లగా అవి ఈశ్వరయ్య భార్య సుజాత వద్దకు వెళ్లి నిలుచున్నాయి. పోలీసులు సుజాతను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు తెలిసింది. హత్యకు గల కారణాలు విచారణలో తెలియాల్సి ఉంది.

ఆస్పత్రికి వచ్చి అనంతలోకాలకు

రోడ్డు ప్రమాదంలో తండ్రి, కొడుకు మృతి



కంచి రాజేంద్ర చైతన్య

శ్రీకాళహస్తిగ్రామీణం(ఏర్పేడు), తొట్టంబేడు: బిడ్డకు ఆస్పత్రిలో వైద్యం చేయించి ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్తున్న కుటుంబంపై ఇసుక ట్రాక్టర్ మృత్యువు రూపంలో దూసుకొచ్చింది. ఈ ఘటనలో తండ్రి, కొడుకు మృతి చెందగా భార్య తీవ్రంగా గాయపడిన విషాద గాథ శ్రీకాళహస్తి మండలంలోని దొమ్మరపాళెం సమీపంలో బుధవారం చోటు చేసుకుంది. గ్రామీణం సీఐ రవినాయక్ కథనం మేరకు.. తొట్టంబేడు మండలంలోని చియ్యవరానికి చెందిన కంచి రాజేంద్ర(35), భార్య గురవమ్మ(30)లు కొడుకు చైతన్య(06)కు జ్వరం రావడంతో శ్రీకాళహస్తిలోని ఆస్పత్రిలో వైద్యం చేయించుకుని తిరుగు ప్రయాణమయ్యారు. అయితే దొమ్మరపాళెం సమీపంలోకి రాగానే ఎదురుగా ఇసుక లోడుతో వస్తున్న ట్రాక్టర్ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో రాజేంద్ర, చైతన్య అక్కడి కక్కడే మృతి చెందారు. గురవమ్మ తీవ్రంగా గాయ పడటంతో వైద్యం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. వీరికి మరో ముగ్గురు పిల్లలు ఉన్నారని సీఐ తెలిపారు.

విహారయాత్రలో విషాదం

వరదయ్యపాళెం: స్నేహితులతో సరదాగా విహార యాత్రకు వచ్చిన ఓ యువకుడు మడుగులో దిగి మృతి చెందిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. నెల్లూరు జిల్లా మనుబోలుకి చెందిన భరత్ కుమార్(19) బుధవారం స్నేహితులతో కలసి సరదాగా విహార యాత్రకు బీఎన్‌కండ్రిగ మండలంలోని ఉబ్బలమడుగునకు వచ్చాడు. ఈత తెలియని భరత్‌కుమార్ మడుగులో దిగడంతో నీట మునిగి మృతి చెందాడు. మృత దేహాన్ని సుళ్లూరుపేట ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై విశ్వనాథ నాయుడు తెలిపారు.

తాళాలు పగులగొట్టి.. బెట్టింగుల్లో పెట్టి

- అదుపులో అంతరాష్ట్ర నిందితుడు
- రూ.20 లక్షల సొత్తు స్వాధీనం

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: తాళాలు వేసిన ఇళ్లను ఎంపిక చేసుకుని రాత్రి, పగలు తేడా లేకుండా తాళాలు పగలగొట్టడం, చోరీ సొత్తుతో క్రికెట్ బెట్టింగులు పెట్టే అంతరాష్ట్ర నిందితుడ్ని శ్రీకాళహస్తి పట్టణ పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకున్నారు. అతని నుంచి రూ.20 లక్షలు విలువైన బంగారు, వెండి వస్తువులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలను డీఎస్పీ కె.నరసింహమూర్తి ఒకటో పట్టణ పోలీసుస్టేషన్ ఆవరణలో వెల్లడించారు. తమిళనాడు రాష్ట్రం తిరువళ్లూరు జిల్లా రాజీవ్‌గాంధీనగర్‌కు చెందిన భరద్వాజన్ ప్రేమ్‌కుమార్ అలియాస్ కుమార్(30) తమిళనాడు, ఉభయ తెలుగు రాష్ట్రాల్లో పలు చోరీ కేసుల్లో నిందితుడు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు వద్ద బుధవారం మధ్యాహ్నం పోలీసులను చూసి పరిగెత్తడంతో ప్రేమ్‌కుమార్‌ను అదుపులోకి తీసుకున్నారు. శ్రీకాళహస్తి పట్టణంతో పాటు తిరుచానూరు, బీఎన్‌కండ్రిగ, రేణిగుంట ప్రాంతాల్లో అయిదు కేసులకు సంబంధించి సొత్తుతోపాటు చోరీలకు పాల్పడే రాడ్‌ను, ల్యాప్‌టాప్‌ను, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. సీఐలు గోపి, రవినాయక్‌ల బృందాన్ని ఎస్పీ సుబ్బరాయుడు అభినందించారన్నారు. సీఐ తిమ్మయ్య. ఎస్సై సుధాకర్‌రెడ్డి, ఏఎస్సై గంగయ్య, చక్రవర్తి, కానిస్టేబుళ్లు హేమాద్రి, రవి, ప్రసాద్, కేశవన్, బాలకృష్ణ, గంగాధరం, అరుణ్, భరత్‌లు పాల్గొన్నారు.

వెంకాబ్ కోళ్ల ధరలు

బ్రాయిలర్ (రైతు ధర)	124
రిటైల్	146
లేయర్	115
బ్రాయిలర్స్	212
బ్రాయిలర్స్ స్కిన్ లెస్	241
లేయర్ మాంసం	195

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



పొలం వద్ద చెంచయ్య మృతదేహం

పెళ్లకూరు: పెళ్లకూరు మండలం చిల్లకూరు వడ్డిపాళెంకి చెందిన బెల్లంకొండ చెంచయ్య(47) అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. పోలీసులు, స్థానికుల వివరాల మేరకు.. వడ్డిపాళెం గ్రామానికి చెందిన చెంచయ్య ఇదే గ్రామానికి చెందిన వైకాపా నేత సత్యనారాయణరెడ్డి అనుచరుడు. మూడు రోజుల కిందట జరిగిన ఘటనలో పెట్రోల్ సీసాతో హల్‌చల్ చేశారు. ఈ క్రమంలో రోజూ మద్యం మత్తులోనే ఉంటున్నారు. బుధవారం తెల్లవారుజామున ఇంటి నుంచి బయటకు వెళ్లిన చెంచయ్య స్వర్ణముఖి సమీపంలోని పొలాల్లో శవమై కనిపించారు. భార్యాభర్తల మధ్య ఘర్షణ జరిగినట్లు సమాచారం. మరోవైపు పొలాల వద్ద ఉన్న విద్యుత్తు తీగలు తగిలి మృతి చెందినట్లు భావిస్తున్నారు. సమాచారం అందుకున్న ఎస్సై నాగరాజు ఘటనా స్థలానికి చేరుకుని ప్రాథమిక విచారణ అనంతరం అనుమానస్పద కేసు నమోదు చేశారు.

మృతదేహంతో నిరసన.. చెంచయ్య మృతికి మాజీ ఎమ్మెల్యే సంజీవయ్య వైకాపా నేతలతో కలిసి రోడ్డెక్కారు. జనాన్ని వెంటబెట్టుకుని ఇదంతా తెదేపా నేతల పనేనంటూ పోలీసులతో వాగ్వాదానికి దిగారు. నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు ఘటనా స్థలానికి చేరుకుని అల్లరిమూకలను చెదరగొట్టి మృతదేహాన్ని నాయుడుపేట తరలించారు.

రోడ్డు ప్రమాదంలో మేస్త్రీ దుర్మరణం

మరో వ్యక్తికి తీవ్ర గాయాలు

తిరుపతి (నేరవిభాగం): పూతలపట్టు - నాయుడుపేట జాతీయ రహదారిలోని తనపల్లి క్రాస్ వద్ద బుధవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో మేస్త్రీ మృతిచెందగా మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. రూరల్ సీఐ చిన్న గోవిందు, ఎస్సై ఎస్‌కే మూర్తి వివరాల మేరకు. . కర్ణాటక రాష్ట్రానికి చెందిన మంజునాథ్ కుమార్ (23) పదేళ్ల కిందట తిరుపతి వచ్చారు. తనపల్లి ఇందిరమ్మ గృహాల్లో నివాసం ఉంటున్న మేస్త్రీ రాజు వినోద్ పరిచయం కావడంతో ఇద్దరూ ఒకే ఇంట్లో ఉంటున్నారు. మంజునాథ్ మరో మేస్త్రీ మణితో ద్విచక్ర వాహనంపై తాజ్ హోటల్ వైపు నుంచి మార్కెట్ యార్డు మార్గంలోకి వచ్చేందుకు జాతీయ రహదారి దాటుతుండగా లారీ ఢీకొంది. ఇద్దరూ లారీ కింద పడటంతో మంజునాథ్ అక్కడికక్కడే మృతిచెందారు. లారీ డ్రైవర్ పరారయ్యాడు. తీవ్రంగా గాయపడిన మణిని రుయాకు తరలించారు. అకస్మాత్తుగా జరిగిన ఘటనతో అతను మానసిక అనారోగ్యానికి గురైనట్లు గుర్తించారు. వివరాలు ఒక్కోసారి ఒక్కోలా చెబుతున్నారు. విషయం చెప్పగానే రాజు వినోద్ కుమార్ స్పృహ కోల్పోవడంతో ఆసుపత్రికి తరలించారు.

పుదుచ్చేరి సీఎం కార్యాలయ సిఫార్సు లేఖతో..
బ్లాక్‌లో శ్రీవారి దర్శన టికెట్ల విక్రయం

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారి దర్శన టికెట్‌ను భక్తులకు అధిక ధరలకు విక్రయించిన దళారిపై తిరుమల వన్‌టౌన్ పీఎస్ పోలీసులు కేసును నమోదు చేశారు. తితిదే విజిలెన్స్ వింగ్ అధికారుల వివరాల మేరకు.. పుదుచ్చేరి రాష్ట్రానికి చెందిన పద్మనాభన్ అక్కడి సీఎం కార్యాలయం నుంచి శ్రీవారి వీఐపీ బ్రేక్ దర్శనానికి తన పేరుతో సిఫారసు లేఖను తీసుకున్నాడు. అనంతరం సదరు లేఖలో తనతోపాటు నెల్లూరుకు చెందిన ఐదుగురు భక్తులను శ్రీవారి దర్శనానికి తీసుకెళతానని చెప్పి రూ.23 వేలు వసూలు చేశాడు. ఈక్రమంలో భక్తులు తమ వద్ద దర్శనం కోసం అధిక నగదు వసూలు చేసినట్లు తితిదే విజిలెన్స్ వింగ్ అధికారులకు ఫిర్యాదు చేశారు. వారి విచారణలో వాస్తవమని తేలడంతో తిరుమల వన్‌టౌన్ పీఎస్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఘాట్‌రోడ్డులో కారు బోల్తా

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారి భక్తుల కారు అదుపుతప్పి బోల్తాపడిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. కర్నూలుకు చెందిన శివ, సంజయ్‌లు 8 మంది కుటుంబ సభ్యులతో కలిసి శ్రీవారి దర్శనార్థం తిరుపతికి వచ్చారు. స్థానికంగా టాటా సుమోను అద్దెకు తీసుకుని మొదటి ఘాట్‌రోడ్డు మీదుగా తిరుపతికి చేరుకుంటుండగా వారి వాహనం 24వ మలుపు వద్ద అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో వాహనంలోని భక్తులకు స్వల్పగాయాలయ్యాయి. వెంటనే వెనుక వచ్చే వాహన చోదకులు భక్తులను వాహనంలో నుంచి బయటకు గాయపడిన వారిని తితిదే సిబ్బంది అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు. వాహనాన్ని పక్కకు తొలగించి రాకపోకలను పునరుద్ధరించారు. బ్రేక్ ఫెయిల్ కావడంతోనే ప్రమాదం చోటుచేసుకుందని డ్రైవర్ హేమంత్ ట్రాఫిక్ పోలీసులకు తెలిపారు.

తిరుపతి

• తిరుపతి • చంద్రగిరి

శ్రమదానంతో రోడ్డు మరమ్మతు

పాకాల, న్యూస్‌టుడే: చిన్న గోర్పాడు పంచాయతీ కొత్తవడ్డిపల్లి నుంచి కొత్తూరు వరకు వాగు నీరు రోడ్డుపైనే ప్రవహించడంతో సుమారు కిలోమీటరు పొడవునా రోడ్డు ఇటీవలి కోతకు గురైంది. ఎమ్మెల్యే పులివర్తి నాని సూచనతో కూటమి నాయకులు శ్రమ దానానికి ముందుకొచ్చారు. స్థానిక ప్రజలతో కలిసి జేసీబీ, ట్రాక్టర్ల ద్వారా మట్టిని తీసుకొచ్చి రోడ్డుపై గుంతలను పూడ్చారు. మాజీ ఎంపీటీసీ సభ్యుడు నాని, స్థానిక నాయకులు విశ్వనాథ నాయుడు, రాజ గోపాల్ నాయుడు, సుబ్రహ్మణ్యం నాయుడు, బాబు నాయుడు, మోహన్, దామోదర్ నాయుడు, ముని రత్నం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అయోడిన్ ధాతువులు అవసరం

తిరుపతి (గ్రామీణ), న్యూస్‌టుడే: ప్రతిఒక్కరికీ నిత్యం అయోడిన్ ధాతువులు అవసరమని, పండ్లతో పాటు అయోడిన్ ఉప్పుని ఆహారంలో తీసుకోవాలని జిల్లా వినియోగదారుల ఫోరం అధ్యక్షుడు రాజారెడ్డి అన్నారు. పెరుమాళ్లపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం వినియోగదారుల క్లబ్ ఆధ్వర్యంలో అయోడిన్ లోపంతో కలిగే రుగ్మతలు, నివారణపై వారోత్సవాలు నిర్వహించారు. పాఠశాల వినియోగదా రుల క్లబ్ గైడ్లు చిట్టెమ్మ, సాంబశివారెడ్డి, హెచ్‌ఎం నాగరాణి తదితరులు పాల్గొన్నారు.

తిరుచానూరు.. మారని తీరు

☛ మళ్లీ ఇన్‌ఛార్జి కార్యదర్శి పాలన

☛ వైకాపా హయాంలో ఐదేళ్లూ అమలు

తిరుచానూరు, న్యూస్‌టుడే: ప్రగతి దిశగా సాగాల్సిన తిరుచానూరు గ్రామ పంచాయతీలో సమస్యలు పేరుకుపోతున్నాయి. ఇక్కడ వైకాపా ఐదేళ్ల పాలనలోనూ శాశ్వత కార్యదర్శిని నియమించలేదు. ఇన్‌ఛార్జ్ కార్యదర్శుల పాలనలోనే నెట్టుకొచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకైనా శాశ్వత కార్యదర్శిని నియమిస్తారని అందరూ ఆశించినా పాత ఆనవాయితీనే కొనసాగిస్తున్నారు. ఏటా కోట్లాది రూపాయల ఆదాయం వచ్చే మేజర్ పంచాయతీ కార్యదర్శిగా ఈవోపీఆర్డీగా పనిచేస్తున్న మాధురిని అధికారులు ఇటీవల నియమించారు. గత ఐదేళ్లూ శాశ్వత కార్యదర్శులు లేకపోవడం.. ఇన్‌ఛార్జ్‌లను నియమించినా కనీసం ఏడాది కూడా పని చేయనీయకపోవడంపై విమర్శలున్నాయి.

▸ పంచాయతీ పరిధిలో ఐదు సచివాలయాలు, 20 వార్డులు, 30 వేల వరకు జనాభా, 150 మందికిపైగా సిబ్బంది ఉన్నారు. ఏటా పార్కింగ్ ఫీజుల రూపంలో రూ.3 కోట్లు, ఇతర



వసుంధర నగర్‌లో రహదారిపై వారం రోజులుగా నిలిచిపోయిన వర్షపు నీరు

పన్నుల రూపేణా రూ.3 కోట్లు, కేంద్ర ఆర్థిక సంఘం నిధులు మరో రూ.2 కోట్ల వరకు వస్తుంటాయి. నిత్యం ఇంటి పన్నులు, భవన నిర్మాణాల అనుమతులు, వివిధ సమస్యలపై పెద్దసంఖ్యలో గ్రామస్థులు వస్తుంటారు. శాశ్వత కార్యదర్శి లేకపోవడం, ఇన్‌ఛార్జ్ కార్యదర్శి పూర్తి స్థాయిలో సమయం కేటాయించకపోవడం పెద్ద సమస్యగా మారింది. సమస్యలపై వచ్చే ప్రజలు తమ గోడును ఎవరికి చెప్పాలో తెలియక వెను దిరగాల్సి వస్తోంది.

▸ గ్రామ పంచాయతీ పెద్దది కావడంతో ఉదయం ఐదు నుంచి పారిశుద్ధ్య సిబ్బంది పనులు ప్రారంభించాల్సి ఉంటుంది. కార్యదర్శి పర్యవేక్షణ లేకపోవడంతో పనులు మొక్కుబడిగా సాగుతున్నాయి. నిత్యం అమ్మవారిని దర్శించుకునేందుకు 20 వేలకు మందికి పైగా భక్తులు వస్తుంటారు. పారిశుద్ధ్య సమస్య తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత పంచాయతీపై ఉంది. మరో నెల రోజుల్లో అమ్మవారి కార్తిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఉత్సవాల సమయంలో కీలక బాధ్యతలను నిర్వహించాల్సి ఉంటుంది.

▸ పంచాయతీ కార్యాలయంలో కీలకమైన జూనియర్ అసిస్టెంట్ పోస్టు సైతం ఏడాదిగా ఖాళీగా ఉంది. చివరకు ఈ పోస్టును సైతం భర్తీ చేయకపోవడం గమనార్హం. కార్యదర్శి అందుబాటులో లేని సమయంలో జూనియర్ అసిస్టెంట్ కీలక బాధ్యతలు నిర్వహిస్తుంటారు. దీనిని సైతం అధికారులు ఖాళీగా ఉంచడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

శ్రీవారి సేవలో తెలంగాణ మంత్రి సీతక్క



▸ ఆలయం ఎదుట మంత్రి సీతక్క

▸ సినీనటుడు దాసరి అరుణ్‌కుమార్

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారిని తెలంగాణ మంత్రి సీతక్క బుధవారం దర్శించుకున్నారు. తెల్లవారు జామున శ్రీవారి తోమాల సేవ, ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో శ్రీవారి మూలమూర్తిని మంత్రి కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. అనంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం అందించగా తితిదే అధికారులు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయం వెలుపల మంత్రి సీతక్క మాట్లాడుతూ.. తెలంగాణలో సీఎం రేవంత్‌రెడ్డి అయ్యాక మొదటిసారి తిరుమల వచ్చానన్నారు. పని ఒత్తిడిలో మొక్కులు చెల్లించుకోవడం ఆలస్యమైందని, 2021 తర్వాత శ్రీవారి సేవలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. శ్రీవారిని తితిదే మాజీ జేఈవో శ్రీనివాసరాజు, సినీ నటుడు దాసరి అరుణ్ కుమార్ దర్శించుకున్నారు.



నారాయణ ఒలింపియాడ్ హైస్కూల్ విద్యార్థులు బి.చమన్ దీప్, డి.దిషిత, ఎం.బ్రితి యోచన, ఉపాధ్యాయులు

అంతర్జాలం సద్వినియోగంతో విజ్ఞాన వికాసం

తిరుపతి (బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: విద్యార్థులు అంతర్జాల వినియోగంతో అనేక విద్యా ప్రయోజిక అంశాలు తెలుసుకోవచ్చని, తద్వారా విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చని నారాయణ ఒలింపియాడ్ హైస్కూల్ ప్రిన్సిపల్ ఎ.మధు చంద్రుడు అన్నారు. బుధవారం అమరావతి నగర్‌లోని నారాయణ ఒలింపియాడ్ పాఠశాలలో 'ఈనాడు' ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రతిభా పాటవ పోటీలు జరిగాయి. ఇందులో భాగంగా 8,9,10 తరగతి విద్యార్థులకు 'ఇంటర్నెట్ వినియోగం వల్ల లాభనష్టాలు, విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. మొదటి, ద్వితీయ, తృతీయ, స్థానాల్లో బి.చమన్ దీప్, డి.దిషిత, ఎం.బ్రితి యోచన విజేతలుగా నిలిచారు. వీరికి 'ఈనాడు' నుంచి బహుమతులు, ప్రశంసా పత్రాలను పాఠశాల ప్రిన్స్‌పల్ ఎ.మధు చంద్రుడు, సీవో ప్రిన్సిపల్ వంశీకృష్ణ, అకడమిక్ డీన్ మురళీ అందించారు.

ఉన్నత విద్యతో జీవితంలో ఉత్తమస్థానం

తిరుపతి (బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: ఉన్నత విద్యతోనే విద్యార్థులు జీవితంలో అత్యున్నత స్థాయికి చేరుకోగలరని, తద్వారా సమాజంలో గౌరవం పొందగలరని విశ్వం విద్యాసంస్థల కరస్పాండెంట్ ఎన్.తులసీ విశ్వనాథ్ అన్నారు. బుధవారం జీవకోనలోని విశ్వం హైస్కూల్లో 'ఈనాడు' ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రతిభా పాటవ పోటీలు జరిగాయి. ఇందులో భాగంగా 8,9,10 తరగతి విద్యార్థులకు 'ఇంటర్నెట్ వినియోగం వల్ల లాభనష్టాలు, విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మొదటి, ద్వితీయ, తృతీయ, స్థానాల్లో ఆర్.మనీషా, పి.పద్మిని, జి.శ్రీకర్ విజేతలుగా నిలిచారు. విజేతలకు 'ఈనాడు' నుంచి అందించిన బహుమతులు, ప్రశంసా పత్రాలను విశ్వం హైస్కూల్ కరస్పాండెంట్ ఎన్.తులసీ విశ్వనాథ్, డైరెక్టర్ విశ్వచందన్‌రెడ్డి అందించారు.



బహుమతులతో విశ్వం హైస్కూల్ విద్యార్థులు ఆర్.మనీషా, పి.పద్మిని, జి.శ్రీకర్

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)
తిరుపతి : 80080 20003
చంద్రగిరి : 80085 74561
పాకాల : 80085 74563

తిరుపతి (నగరపాలిక), న్యూస్‌టుడే

సమస్య: తిలక్‌రోడ్డులోని పెట్రోల్ బంక్‌ను ఆనుకొని నిర్మించిన మాస్టర్‌ప్లాన్ రోడ్డు అపరిశుభ్రంగా ఉంది. రోడ్డు నిండా వాహనాలు పార్కింగ్ చేయడంతో వాటి కింద శుభ్రం చేయలేకపోతున్నారు. **- ధనుంజయ, నవాబ్‌పేట**

సమస్య: రెడ్డి అండ్ రెడ్డి కాలనీలో వెంకటరమణ గుండె ఆసుపత్రి పక్కన సందులో చెత్త కుప్పలు ఉంటున్నాయి. దుకాణదారులు చెత్తను వేస్తున్నారు. నగరపాలిక వాహనాలొచ్చే అవకాశం తక్కువగా ఉండటంతో వారం రోజులైనా అలాగే ఉంటోంది. **- గీత, టి.కె.స్ట్రీట్**

సమాధానం: మాస్టర్ ప్లాన్ రోడ్డులో వాహనాల పార్కింగ్‌తో ఇబ్బందిగా ఉంది. ప్రత్యామ్నాయ చర్యలు చేపడుతాం. రెడ్డి అండ్ రెడ్డి కాలనీలోని చెత్తదిబ్బల్ని తొలగిస్తాం. **- యువ అన్వేష్, వైద్యాధికారి, నగరపాలిక**

పాకాల, న్యూస్‌టుడే:

సమస్య : స్థానిక ప్రభుత డిగ్రీ కళాశాలలో హిందీ బోధించేవారు లేక విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నియామకం చేపట్టాలి. **- విద్యార్థుల తల్లిదండ్రులు**

సమాధానం: దరఖాస్తులు ఆహ్వానిస్తున్నాం. శనివారం ముఖాముఖి నిర్వహించి అర్హులను ఎంపిక చేసి సమస్యను పరిష్కరిస్తాం. **- మొహిద్దీన్ బాషా, ప్రిన్సిపల్**

భాకరాపేట, న్యూస్‌టుడే

సమస్య: భాకరాపేట బీసీ కాలనీలో కొన్ని రోజులుగా వీధి దీపం వెలగడం లేదు. **- రోజా, స్థానికురాలు**

సమాధానం : వెంటనే సమస్య పరిష్కరిస్తాం. **- రామ్మోహన్, పంచాయతీ కార్యదర్శి, భాకరాపేట**

యర్రావారిపాలెం, న్యూస్‌టుడే

సమస్య: ఉదయమాణిక్యం పంచాయతీ నగిరి కాలనీలో వీధిదీపాలు వెలగడం లేదు. **- దివాకర్, స్థానికుడు.**

సమాధానం: సిబ్బందితో కొత్తవి ఏర్పాటు చేయిస్తాం. ప్రజలు సమస్యలు ఉంటే ఫిర్యాదుల పుస్తకంలో నమోదు చేసి పేర్లు, ఫోన్ నంబరు పొందుపరిస్తే తక్షణమే స్పందిస్తాం. **- మోహన్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి**

గడువులోపు ఐసీసీసీ పనులు పూర్తిచేయాలి

తిరుపతి(నగరపాలిక), న్యూస్‌టుడే: తిరుపతి స్మార్ట్‌సిటీ కార్పొరేషన్ లిమిటెడ్ నిధులతో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ (ఐసీసీసీ) పనులు నిర్ణీత గడువులోపు పూర్తిచేయాలని తిరుపతి స్మార్ట్ సిటీ మేనేజింగ్ డైరెక్టర్, నగరపాలక కమిషనర్ ఎన్.మౌర్య ఆదేశించారు. పనుల పురోగతిపై బుధవారం సమీక్ష నిర్వహించారు. ప్రాజెక్టుతో బహుళ ప్రయోజనాలు ఉన్నాయన్నారు. నగర భద్రత, రాకపోకల క్రమబద్ధీకరణ, కాలుష్య నియంత్రణ, రుసుం వసూళ్లు వంటివి సులభతరం అవుతాయన్నారు. జీఎం చంద్రమౌలి, ఎస్ఈ శ్యాంసుందర్ పాల్గొన్నారు.



సమీక్ష నిర్వహిస్తున్న కమిషనర్ ఎన్.మౌర్య

25న ఆధార్ సేవలు

తిరుపతి (గ్రామీణ), న్యూస్‌టుడే: మండలంలోని పలు పంచాయతీల్లో ఆధార్ సేవలు అందుబాటులోకి తెస్తున్నట్లు ఎంపీడీవో రామచంద్ర తెలిపారు. గురువారం సాయినగర్, మల్లంగుంట, వెంకటపతినగర్, యోగిమల్లవరం, మంగళం పచాయతీల్లో, 25వ తేదీన పద్మావతీపురం, శ్రీనివాసపురం, తుమ్మలగుంట, పేరూరు, దామినేడు, తిరుమలనగర్ తుడా క్వార్టర్స్ వద్ద ఆధార్ సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు.

రెవెన్యూ గ్రామసభకు విన్నపాలు

చంద్రగిరి, న్యూస్‌టుడే: రీసర్వే గ్రామమైన నరశింగాపురంలో సర్పంచి చెంచురత్నంశెట్టి అధ్యక్షతన తహసీల్దారు శివరాం సుబ్బయ్య బుధవారం గ్రామసభ నిర్వహించారు. మ్యుటేషన్స్, జాయింట్ ఎల్.పి..ఎం.లు, భూ తగాదాలు, సెక్షన్22(ఎ) భూములపై వినతిపత్రాలను అందించారు. మండల సర్వేయర్ సురేష్‌బాబు, ఆర్ఐ భాస్కర్, వీఆర్వో విజయకుమార్, గ్రామ సర్వేయర్ మమత పాల్గొన్నారు.

నేడు రైల్వేకాలనీలో విద్యుత్తు సరఫరాకు అంతరాయం

తిరుపతి (నగరం), న్యూస్‌టుడే: రైల్వే కాలనీలో గురువారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఆశాఖ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు.

పేదలకు అన్నదానం

తిరుపతి (నగరం), న్యూస్‌టుడే: మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ జన్మదినాన్ని పురస్కరించుకుని బుధవారం రుయా ఆసుపత్రి ఎదుట తెదేపా సీనియర్ నాయకుడు మునిశేఖర్ రాయల్ ఆధ్వర్యంలో అన్నదానం జరిగింది. ఆర్పీ మునివాసులు, బాలసుబ్రహ్మణ్యం, మునిరామయ్య, ఆనంద్ నాయుడు, చినబాబు, దాము తదితరులు పాల్గొన్నారు.

తిరుమలలో వృద్ధురాలి అదృశ్యం



లక్ష్మమ్మ

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారి దర్శనానికి వచ్చిన ఓ వృద్ధురాలు అదృశ్యమైన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. తిరుమల వన్‌టౌన్ పోలీసుల వివరాలమేరకు.. చిత్తూరు జిల్లా ఏనుగుట్టపల్లికి చెందిన లక్ష్మమ్మ (75) కుటుంబ సభ్యులతో కలిసి ఈనెల 8వ తేదీన తిరుమలకు చేరుకుని శ్రీవారి గరుడ సేవలో పాల్గొన్నారు. మరుసటి రోజు మధ్యాహ్నం వెంగమాంబ అన్నప్రసాద సత్రంలో భోజనం చేశారు. రాత్రికి నందకం అతిథిగృహం వద్ద జీపు ఎక్కి కిందకు వెళ్లగా అనంతరం ఆచూకీ లభించ లేదు. కుటుంబసభ్యుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. వృద్ధురాలిని గుర్తిస్తే 087722 89027లో సంప్రదించాలని వారు సూచించారు.

దౌర్జన్యం కేసులో తెదేపా నేతపై కేసు

తిరుపతి (నేరవిభాగం, గ్రామీణ), న్యూస్‌టుడే: తిరుచానూరు రోడ్డులో నిర్మిస్తున్న రేకుల షెడ్డు, బోరు మోటారు ధ్వంసం కేసులో మాజీ ప్రజాప్రతినిధి అల్లుడిపై కేసు నమోదు చేశారు. తిరుపతి రూరల్ సీఐ చిన్న గోవిందు వివరాల మేరకు.. 'తిరుపతి - తిరుచానూరు రోడ్డులోని పీఎస్ 4 హోటల్ పక్కన సర్వే నంబరు 255- 1బిలో విశ్రాంత డీఎస్పీ భాస్కర్ నాయుడు రేకుల షెడ్డు నిర్మిస్తున్నారు. అంతకు ముందు బోరు వేశారు. బుధవారం తెల్లవారు జామున మాజీ ప్రజాప్రతినిధి అల్లుడు తెదేపా నాయకుడు బీఎల్ సంజయ్, అతని అనుచరులు చాణక్య, జీవ, విజయ్‌తోపాటు మరో 30 మంది రేకుల షెడ్డును పాక్షికంగా ధ్వంసం చేశారు. బోరు మోటారు వైర్లు, పైపులు బోరులోకి వదిలేశారు. అక్కడే ఉన్న మేస్త్రీ విషయాన్ని భాస్కర్ నాయుడుకు తెలియజేయగా.. అతను, కుటుంబ సభ్యులతో కలిసి అక్కడికి వచ్చి అడ్డుకునే యత్నం చేయగా దాడులకు పాల్పడ్డారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి వెళ్లి నిలువరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

గ్రానైట్ లారీ స్వాధీనం



స్వాధీనం చేసుకున్న గ్రానైట్ బండల లోడుతో ఉన్న లారీ

చంద్రగిరి, న్యూస్‌టుడే: పూతలపట్టు- నాయుడుపేట జాతీయ రహదారిలో బుధవారం వేకువ జామున ప్రకాశం జిల్లా నుంచి కర్ణాటక రాష్ట్రంలోని హోసూరుకు గ్రానైట్ బండలు తరలిస్తున్న లారీని విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. సరైన దస్త్రాలు లేని కారణంగా వాహనాన్ని చంద్రగిరి పోలీసులకు అప్పగించారు. పరిమితికి మించి భారీగా గ్రానైట్ బండలను తరలిస్తున్నట్లు గుర్తించారు.

అగ్గిపెట్టె మచ్చాపై దాడి.. ఫిర్యాదు



పోలీస్ స్టేషన్ ఎదుట మచ్చా

తిరుపతి (నేరవిభాగం) : యూట్యూబర్ అగ్గిపెట్టె మచ్చా (కిరణ్ కుమార్)పై జరిగిన దాడిపై బుధవారం రాత్రి ఫిర్యాదు అందింది. రెండురోజుల కిందట రామచంద్రాపురం మండలంలోని స్వగ్రామంలో ఉన్న అగ్గిపెట్టె మచ్చాను ఓ యువకుడు ద్విచక్ర వాహనంలో తిరుపతికి తీసుకొచ్చాడు. మరో నలుగురు యువకులతో కలిసి మద్యం తాగారు. తర్వాత వారి మధ్య జరిగిన గొడవతో రోడ్డుపై విచక్షణా రహితంగా దాడికి పాల్పడ్డారు. గాయపడ్డ ఆయన అక్కడ నుంచి వెళ్లిపోయారు. బుధవారం రాత్రి అలిపిరి పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేశారు. తనపై గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేశారని.. కఠిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. అలిపిరి సీఐ రామ్‌కిషోర్ స్పందిస్తూ.. కోర్టు అనుమతి మేరకు కేసుపై నిర్ణయం తీసుకుంటామన్నారు.

శ్రీకాళహస్తి

•శ్రీకాళహస్తి • సత్యవేడు



వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్న ఎస్సై విశ్వనాథనాయుడు

పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు

బీఎన్‌కండ్రిగ : పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా స్థానిక జడ్పీ ఉన్న పాఠశాలలో ఎస్సై విశ్వనాథనాయుడు ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా 'నేరాల నియంత్రణలో యువత పాత్ర' అంశంపై విద్యార్థులకు వివరించి వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఉత్తమ ప్రతిభ చూపిన జ్యోత్స్న, వైష్ణవి, హస్మితలకు బహుమతులు అందించారు. హెడ్‌కానిస్టేబుల్ నాగరాజునాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
శ్రీకాళహస్తి: 80085 74555
నాగలాపురం: 98854 43308

న్యూస్‌టుడే, శ్రీకాళహస్తి

సమస్య: రాజీవ్‌నగర్‌లో అన్నీ సమస్యలే. నీళ్లు లేవు. విద్యుద్దీపాలు వెలగడం లేదు. రాత్రి వేళల్లో పాములు ఇళ్లల్లోకి వచ్చేస్తున్నాయి. రోడ్ల పరిస్థితి అంతంతమాత్రమే. అధికారులకు విన్నవించినా ఫలితం లేదు. **- మారయ్య, రాజీవ్‌నగర్**

సమాధానం: సమస్యలపై తమకు ఎలాంటి ఫిర్యాదులు అందలేదు. సంబంధిత అధికారులను పంపి సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకుంటాం.
- గిరికుమార్, కమిషనర్, పురపాలక సంఘం

న్యూస్‌టుడే, రేణిగుంట

సమస్య: రేణిగుంట ఎంపీడీవో కార్యాలయం వద్ద రాత్రి పూట చిమ్మ చీకటిగా ఉంది. రాకపోకలు సాగించేందుకు స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. **- నూర్, స్థానికుడు**

సమాధానం: ఇక్కడ గతంలో వీధి దీపాలు ఏర్పాటు చేయించాం. వాటి తీగలను ఎవరో కట్ చేశారు. త్వరలో ఏర్పాటు చేస్తాం. **- విష్ణు చిరంజీవి, ఎంపీడీవో**

వీధి దీపాల పునరుద్ధరణ

నాగలాపురం, న్యూస్‌టుడే: నాగలాపురంలోని వరశక్తి వినాయకస్వామి ఆలయం వీధి దీపాలను సర్పంచి చిన్న దురైసుధ బుధవారం పునరుద్ధరించారు. వీధి దీపాలు తరచూ మరమ్మతులకు గురై అంధకారం అలముకుంటున్న విషయమై 'మేమున్నాం.. మీకు తోడుగా' శీర్షికన 'ఈనాడు'లో మంగళవారం ప్రచురితమైన కథనానికి చిన్న దురైసుధ స్పందించి మరమ్మతులు చేశారు.

పంటకాలువలో పూడికతీత

స్పందనకు వందనం

వరదయ్యపాళెం, న్యూస్‌టుడే: స్థానిక పంచాయతీలోని శ్రీకాళహస్తి-తడ మార్గంలో ఇండియన్ పెట్రోల్ బంకు సమీపంలోని పంటకాలువలో ఎట్టకేలకు అధికారులు పూడికతీత పనులు చేపట్టారు. ఈ విషయమై ఈ నెల 19వ తేదీన 'ఈనాడు'లో 'మేమున్నాం.. మీకు తోడుగా' శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన పంచాయతీ కార్యదర్శి బసిరెడ్డి పూడికతీత పనులు చేపట్టడంతో సమస్య తాత్కాలికంగా పరిష్కారమైంది.

అసలే దారిద్ర్యం.. వర్షాలకు మరింత ఛిద్రం

నియోజకవర్గంలో అధ్వాన రహదారులకు మోక్షం వీడేనా?



సత్యవేడు మార్గంలో యానాదివెట్టు వద్ద గుంతలతో నిండిన రహదారి



నరకప్రాయంగా నాగలాపురం-టీపీ కోట రహదారి



మురికికూపాలతో సత్యవేడు-మాదరపాకం రహదారి

న్యూస్‌టుడే, వరదయ్యపాళెం

నియోజకవర్గంలో రహదారులు అధ్వానంగా మారాయి. గత పాలకుల నిర్లక్ష్యవైఖరితో రహదారుల ఆధునికీకరణను పట్టించుకోకపోగా, కనీసం గుంతల్లో తట్ట మట్టి పోసి మరమ్మతులకు సైతం నోచుకోక పోవడం ప్రజల పాలిట శాపంగా మారింది. దీంతో ఏడు మండలాల్లోని పలు రహదారుల్లో అడుగడుగునా గుంతలతో అవస్థలు పడుతున్నారు. తాజా వర్షాలతో మరింత ఛిద్రమై రాకపోకలకు ప్రత్యక్ష నరకం కనిపిస్తోంది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రహదారులకు ఇకనైనా మోక్షం కల్గుతుందని ప్రజల్లో ఆశలు రేకెత్తిస్తున్నాయి.

● గత ప్రభుత్వ పాలనకు నాగలాపురం-టీపీ కోట మార్గం నిదర్శనంగా నిలుస్తోంది. ఈ రహదారి ఆధునికీకరణకు నిధులు మంజూరు చేశామంటూ గత వైకాపా ప్రభుత్వ హయాంలో నాటి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చేతుల మీదగా ఆర్భాటంగా శంకుస్థాపన చేశారు. శంకుస్థాపన చేసి చేతులు దులుపుకున్నారే గానీ మూడేళ్లు గడిచినా రహదారి ప్రగతికి ఒక్క అడుగుపడలేదు. ఈ లోగా సార్వత్రిక ఎన్నికలు సమీపించడంతో ఆఘమేఘాల మీద ఈ రహదారి అభివృద్ధికి ఎంపీ నిధులు మంజూరైనట్లు తిరుపతి ఎంపీ గురుమూర్తి చేతుల మీదగా మరోమారు శంకుస్థాపన చేశారు. ప్రస్తుతం ఆయనే ఎంపీ అయినా ఈ రహదారి ప్రగతి గురించి పట్టించుకున్న దాఖలాలు లేవు. ఈ రహదారిలో ప్రయాణం అడుగడుగునా గుంతలతో ప్రజలకు ప్రత్యక్ష నరకాన్ని తలపిస్తోంది.

రాకపోకలకు అవస్థలు

● వరదయ్యపాళెం మండలంలో తడ-సత్యవేడు రహదారి, వరదయ్యపాళెం-పాండూరు రహదారి, సంతవేలూరు రహదారి గుంతలతో నిండి అవస్థలను కల్గిస్తోంది. ● నారాయణవనం మండలంలో పాలమంగళం ఉత్తరం-తుంబూరు రహదారి, తుంబూరు-వెలుతురుకండ్రిగ మార్గం, వెత్తలతడుకు రహదారి, ఎరికంబట్టు రహదారి అధ్వానంగా ఉన్నాయి. ● నాగలాపురం మండలంలో టీపీకోట రహదారి, వినోబా నగర్, నందనం, అడవికండ్రిగ రహదారులు అడుగడుగునా గుంతలతో నిండి రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ● కేవీబీపురం మండలంలో రాజులకండ్రిగ, కోవనూరు, తిమ్మసముద్రం మార్గాల్లో రహదారులు ఛిద్రమైయ్యాయి. ● సత్యవేడు మండలంలో వెంకటరాజులకండ్రిగ, మాదరపాకం, జడేరి, అల్లపగుంట, కొల్లడం, చెరివి రహదారుల్లో ప్రయాణం నరక ప్రాయం.

● బీఎన్‌కండ్రిగ మండలంలో ఆర్.అనంతాపురం, శ్రీకాళహస్తి-తడ రహదారి నుంచి పదవమైలు రహదారి, జీఎన్‌కండ్రిగ, చిన్నాయగుంట, పూసలపల్లి, తహనగర్, బంగ్లాతోట, జంబుగోళం రహదారులలో గుంతలు అయిదేళ్లుగా అభివృద్ధికి నోచుకోక ప్రస్తుతం లోయలను తలపిస్తున్నాయి.



సమస్యలు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి

పేదల సంక్షేమానికి ప్రాధాన్యం

శ్రీకాళహస్తి(గ్రామీణం(ఏర్పేడు), న్యూస్‌టుడే: పేదల సంక్షేమానికి ఎన్డీఏ ప్రభుత్వం పెద్దపీట వేసిందని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి తెలిపారు. పల్లెపండుగ వారోత్సవాల్లో భాగంగా శ్రీకాళహస్తి మండలంలోని గుండ్లపల్లిలో బుధవారం రూ.6లక్షలతో సిమెంట్ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను పూర్తి స్థాయిలో పరిష్కరించేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. ముందుగా సిమెంట్‌రోడ్లు, మురుగు కాలువలను ఏర్పాటు చేసి అంచెలంచెలుగా గ్రామాలను అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. స్థానికులను అడిగి సమస్యలు తెలుసుకుని త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో తెదేపా మండల అధ్యక్షులు కామేష్ యాదవ్, చెంచయ్యనాయుడు, ఈశ్వర్‌రెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కాలేయవ్యాధి బాధిత బాలుడికి రూ.7 లక్షల అందజేత



బాలుడి తల్లి గౌతమికి చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

నాగలాపురం, న్యూస్‌టుడే: పిచ్చాటూరు మండలంలోని కారూరుకు చెందిన ప్రకాష్, గౌతమి దంపతుల కుమారుడు నితీష్ కాలేయ వ్యాధితో ఇబ్బందిపడుతూ శస్త్రచికిత్స చేసుకున్నారు. చికిత్స నిమిత్తం రూ.20 లక్షలకు పైగా ఖర్చు కావడంతో వారు ముఖ్యమంత్రి సహాయ నిధికి ఆర్థిక సహాయానికి దరఖాస్తు చేసుకున్నారు. విషయం ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం దృష్టికి వెళ్లడంతో ఆయన అమరావతిలో సమస్యను అధికారులకు వివరించి రూ.7 లక్షలను ముఖ్యమంత్రి సహాయనిధిలో మంజూరు చేయించి బుధవారం పుత్తూరులోని తన నివాసం వద్ద బాలుడి తల్లికి చెక్కును అందించారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ ఛైర్మన్ ఇళంగోవన్‌రెడ్డి, నేతలు పద్దురాజు, కొల్లాపురిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మహాకుంభాభిషేకం.. శ్రీకాళహస్తి(గ్రామీణం(ఏర్పేడు) : శ్రీకాళహస్తి మండలంలోని వాంపల్లిలో నూతనంగా నిర్మించిన శ్రీబాల త్రిపుర సుందరీ దేవి సమేత శ్రీకేదారేశ్వరి స్వామి ఆలయంలో బుధవారం ఘనంగా మహా కుంభాభిషేకం నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య హోమ పూజలు నిర్వహించి స్వామి, అమ్మవారుల విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఈ విశేషోత్సవాన్ని పురస్కరించుకుని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి ఆలయానికి సారె పంపిణీ చేశారు. వివిధ పార్టీలకు చెందిన నేతలు వేర్వేరుగా దర్శించుకున్నారు.



సత్తా చాటిన విద్యార్థులతో పాఠశాల ఉపాధ్యాయురాలు

మేధస్సుకు పదును

'ఈనాడు' ఆధ్వర్యంలో శ్రీకాళహస్తిలోని ఎంజీఎం ఇంగ్లిషు మీడియం హైస్కూలు ఆవరణలో పాఠశాలలో విద్యార్థులకు ప్రతిభా పాటవ పోటీలు జరిగాయి. ఇందులో భాగంగా బుధవారం 'ఇంటర్‌నెట్ వాడకం వల్ల లాభాలు-నష్టాలు, విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అన్న అంశంపై వ్యాస రచన పోటీలు నిర్వహించారు. పోటీల్లో పాల్గొనేందుకు విద్యార్థులు ఎంతో ఉత్సాహాన్ని కనబరిచారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులు చరిత, ఎం.లజరస్, గురుపాదనాయక్‌లు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచి ప్రశంశా పత్రాలతో పాటు బహుమతులు అందుకున్నారు. వీరికి పాఠశాల ఉపాధ్యాయులు బహుమతులతో పాటు ప్రశంసా పత్రాలు అందజేశారు. **- న్యూస్‌టుడే, శ్రీకాళహస్తి**



వ్యాస రచన పోటీల్లో పాల్గొన్న ఎంజీఎం ఇంగ్లిషు మీడియం హైస్కూలు విద్యార్థులు

దుకాణాల ఏర్పాటుపై స్థల పరిశీలన



దుకాణాల ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆర్డీవో, డీఎస్పీ, కమిషనర్ వివిధ శాఖల అధికారులు

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: ఏరియా ఆస్పత్రికి వెళ్లే మార్గంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో టపాకాయల దుకాణాల ఏర్పాటు విషయమై అధికారులు స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా బుధవారం ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి, డీఎస్పీ కె.నరసింహమూర్తిలు స్థలాన్ని పరిశీలించారు. దుకాణాలు ఎన్ని ఏర్పాటు చేస్తున్నారు. చేపట్టాల్సిన భద్రతా చర్యలు తదితర అంశాలపై వివిధ శాఖల అధికారులతో ఆర్డీవో చర్చించారు. జిల్లా కలెక్టర్‌కు నివేదికలు పంపుతామని, అక్కడ నుంచి అనుమతి రాగానే దుకాణాల ఏర్పాటు చేసుకోవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో అగ్నిమాపక అధికారి నాగేశ్వర్‌రెడ్డి, పురపాలక సంఘ కమిషనర్ గిరికుమార్, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ వేణుగోపాల్‌రెడ్డి, ట్రాన్స్‌కో అధికారులు పాల్గొన్నారు.

ఈ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్లకు ఉత్తర్వులు

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: శ్రీకాళహస్తి, కాణిపాకం ఆలయాల్లో భద్రతా సిబ్బంది, పారిశుద్ధ్య విభాగం, మానవశక్తిని అందించే వ్యవస్థలకు సంబంధించి టెండర్లను కేంద్రీకృత ఈ-ప్రొక్యూర్‌మెంట్ విధానంలో నిర్ణయించేలా దేవాదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ ఆదేశాలు జారీ చేశారు. ఇటీవల నిబంధనలు పాటించలేదని, నాణ్యత పట్టించుకోలేదని, టెండర్ల నిర్వహణ దోషభూయిష్టంగా జరగడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.

మాధవయ్యను విధుల్లోకి తీసుకోండి

నాగలాపురం, న్యూస్‌టుడే: మండలంలోని ఎస్ఎస్‌పురంలో సస్పెన్షన్‌కు గురైన క్షేత్ర సహాయకుడు మాధవయ్యను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని ఎంపీడీవో బాలాజీనాయక్‌కు పంచాయతీలోని ఉపాధి హామీ కూలీలు బుధవారం వినతిపత్రం అందించారు. నిజాయతీగా పని చేస్తున్న మాధవయ్యపై వ్యక్తిగత కక్షతో కొందరు అసత్యాలతో కూడిన వీడియో చిత్రీకరించి ఫిర్యాదు చేశారన్నారు. ఈ విషయాన్ని ఆవ్యక్తి అంగీకరించినందున క్షేత్ర సహాయకుడిపై చర్యలను ఉపసంహరించి బాధ్యతలు అప్పగించాలని వారు కోరారు. కార్యక్రమంలో ఎస్ఎస్‌పురం మాజీ సర్పంచి మాతయ్య, తెలుగుయువత నేత ప్రకాష్‌యాదవ్‌లు ఉన్నారు.

విద్యార్థిని శివాత్మికకు నగదు బహుమతి



విద్యార్థికి ధ్రువపత్రం అందిస్తున్న అధికారులు

నారాయణవనం, న్యూస్‌టుడే: ప్రపంచ బాలికల దినోత్సవం సందర్భంగా జిల్లా ఆరోగ్యశాఖ, ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో నారాయణవనం బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థిని శివాత్మిక తృతీయ స్థానంలో నిలిచింది. బుధవారం తిరుపతిలో కలెక్టర్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థిని శివాత్మికకు రూ.రెండు వేల నగదు బహుమతి, ప్రశంసాపత్రం, జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థినిని ప్రధానోపాధ్యాయురాలు శశికళ అభినందించారు.

భారీ వాహనాలతో రోజూ తిప్పలే

రేణిగుంట : రేణిగుంట పంచాయతీలోని రోడ్లలో నిత్యం భారీ వాహనాలు రావడం, కూడళ్ల సమీపంలో అవి తిరగలేక అడ్డుగా నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు తప్పడంలేదు. పోలీసుస్టేషన్ లైన్‌వీధిలో ఇలా ఒక లారీ ఇరుక్కుపోయినా పోలీసువారు మాత్రం అటు వైపు కన్నెత్తి చూడడంలేదు. అన్నదానసత్రం, మిరియాలబాబా వీధుల్లోని ట్రేడర్స్‌కు నిత్యం పెద్ద సంఖ్యలో భారీ వాహనాల్లో పగలు సరకులు రావడంతో ఇబ్బందులు తప్పడంలేదు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన

తొట్టంబేడు, న్యూస్‌టుడే: ప్రతి పౌరుడికి సమాచార హక్కు చట్టం బ్రహ్మాస్త్రం లాంటిదని న్యాయవాది వల్లూరి ప్రగ్నశ్రీ తెలిపారు. బుధవారం పట్టణంలోని ఎస్వీఏ ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో రాజనీతి శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో సమాచార హక్కు చట్టంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆమె హాజరయ్యారు. సమాచార హక్కు చట్టం సామాన్యుడికి అధికారులకు మధ్య వారధిలా పని చేస్తుందన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

సత్యవేడు, న్యూస్‌టుడే: మండలంలోని ఇరుగుళం పంచాయతీ గొల్లపాలెం దళితవాడకు చెందిన రవి (51) అనే వ్యక్తి విద్యుదాఘాతంతో మృతి చెందారు. ఈ ఘటన మంగళవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. శ్రీసిటీలో పనులు ముగించుకుని ఇంటికి వచ్చిన రవి ఫ్యాన్ స్విచ్ ఆన్ చేయడంతో విద్యుదాఘాతానికి గురయ్యారు. స్థానికులు గుర్తించి సత్యవేడు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లినప్పటికీ అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. రవికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. శ్రీసిటీ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కార్మికుడి..

రేణిగుంట, న్యూస్‌టుడే: పరిశ్రమలో పని చేస్తున్న కార్మికుడు విద్యుదాఘాతంతో మృతి చెందాడు. గాజులమండ్యం పోలీసుల కథనం మేరకు... రేణిగుంట-తిరుపతి మార్గంలోని పారిశ్రామికవాడలో ఒడిస్సా రాష్ట్రానికి చెందిన అమర్ బెహ్ర(26) నాలుగు సంవత్సరాలుగా పని చేస్తున్నాడు. బుధవారం సాయంత్రం పరిశ్రమలో విధులు నిర్వహిస్తుండగా విద్యుదాఘాతానికి గురై కిందపడ్డాడు. వెంటనే తోటి కార్మికులు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ఆయుధపూజలో పాల్గొన్న సంయుక్త కమిషనర్ బాలూనాయక్

కార్మికులకు అండగా కార్మికశాఖ

రేణిగుంట, న్యూస్‌టుడే: కార్మిక చట్టాలను గౌరవించి విద్యుత్ యాజమాన్యానికి, కార్మికులకు న్యాయం చేసే దిశగా కార్మిక శాఖ ఉంటుందని కర్నూల్ జోన్ శాఖ సంయుక్త కమిషనర్ బాలూనాయక్ తెలిపారు. బుధవారం స్థానిక 220 కేవీ సబ్‌స్టేషన్‌లో నిర్వహించిన ఆయుధపూజకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏపీ ఎస్పీడీసీఎల్ అధికారులు, ఇంజినీర్లు, ఒప్పంద కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

శోత్రియ భూముల్లో మళ్లీ ఆక్రమణల పర్వం

వరదయ్యపాళెం, న్యూస్‌టుడే: మండలంలోని చిన్నపాండూరు పంచాయతీ పాదిరికుప్పంలోని శోత్రియ భూముల్లో మళ్లీ ఆక్రమణల పర్వం కొనసాగుతోంది. తాజాగా అక్కడ రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డుకు సమీపంలోనే ఆక్రమణదారులు రెవెన్యూ అధికారుల ఆదేశాలను బేఖాతరు చేస్తూ బుధవారం ట్రాక్టరుతో భూమిని చదును చేసే పనులు చేపట్టారు. త్వరలోనే ఈ భూముల్లో సాగు పనులు చేసేందుకు సిద్ధమవడం చర్చనీయాంశమైంది. సమాచారం అందుకున్న తహసీల్దారు రాజశేఖర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. దుక్కిదున్నిన ట్రాక్టరును సీజ్ చేయాల్సిందిగా వీఆర్వోను ఆదేశించారు. ఆక్రమణలను అడ్డుకునేందుకు ఇద్దరు వీఆర్వోలతో నిఘా ఉంచనున్నట్లు తహసీల్దారు తెలిపారు.

మహిళ అదృశ్యం.. రేణిగుంట : గాజులమండ్యం పోలీస్ స్టేషన్ పరిధిలో మహిళ అదృశ్యమైన ఘటన చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు స్థానిక వినాయకనగర్‌లో కాపురం ఉంటున్న బ్రహ్మానందర్‌రెడ్డి ఓ ప్రైవేట్ పరిశ్రమలో పని చేస్తున్నారు. అతని భార్య ప్రైవేటు పరిశ్రమలో పని చేస్తోంది. ఆదివారం రాత్రి నుంచి తన భార్య కనిపించలేదని పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు బుధవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆలయ స్థలం.. ఆక్రమణలకు ఆజ్యం



శ్రీకాళహస్తీశ్వరాలయ స్థలాలు ఆక్రమణలకు గురవుతున్నా పట్టించుకోవాల్సిన అధికారులు పట్టీ పట్టనట్లు వ్యవహరించడంతో విమర్శలు గుప్పుమంటున్నాయి. బాబుఅగ్రహారంలోని నారద పుష్కరిణి పక్కన ఆలయానికి సంబంధించిన స్థలంలో ఇన్నాళ్లపాటు గోడను నిర్మించి ఆక్రమణలకు వీల్లేకుండా చర్యలు చేపట్టారు. అయితే కొందరు దుకాణదారులు ఇక్కడి స్థలాన్ని ఆక్రమించి ఎంచక్కా దుకాణమే పెట్టేశారు. ఇప్పుడు పట్టించుకోకుంటే పక్కా ఆక్రమణలు జరిగితే మళ్లీ తొలగించడం కష్టసాధ్యమే. దీనిపై ఆలయ అధికారులు శ్రద్ధ చూపాల్సి ఉంది. **- న్యూస్‌టుడే, శ్రీకాళహస్తి**

విద్యుదాఘాతంతో కార్మికుడికి గాయాలు

శ్రీకాళహస్తి(గ్రామీణం(ఏర్పేడు), న్యూస్‌టుడే: విద్యుదాఘాతంతో ఓ కార్మికుడి తీవ్రంగా గాయపడిన ఘటన శ్రీకాళహస్తి మండలంలోని చెర్లోపల్లి సమీపంలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు కథనం మేరకు.. ఆరువరుసల రహదారి నిర్మాణం పక్కన విద్యుత్తు దీపాలు ఏర్పాటు చేస్తున్న పశ్చిమ బెంగాల్‌కు చెందిన కార్మికుడి సమరుల్‌కి 11 కేవీ విద్యుత్తు తీగలు తగలడంతో తీవ్రంగా గాయ పడ్డాడు. దీన్ని గుర్తించిన తోటి కార్మికులు వైద్యం నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

నిందితుల నుంచి వాహనాలు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాలతో ఎస్సై రామస్వామి, సిబ్బంది

సత్యవేడు, న్యూస్‌టుడే: నియోజకవర్గంలోని సత్యవేడు, నాగలాపురం, పిచ్చాటూరు పోలీస్ స్టేషన్‌లో నమోదైన చోరీ కేసులకు సంబంధించి ఇద్దరి నిందితులను ఆంధ్ర సరిహద్దు మాదరపాకం మార్గం వద్ద అరెస్టు చేశారు. ఎస్సై రామస్వామి రెండు బృందాలతో ముమ్మరంగా దర్యాప్తు చేపట్టారు. బుధవారం ఆంధ్ర సరిహద్దు ప్రాంతం మాదరపాకం మార్గంలో తనిఖీ చేస్తుండగా అనుమానం వచ్చిన మునివేలు, సంతోష్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా వారి వద్ద నుంచి ఐదు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని అరెస్టు చేశారు. నిందితులిద్దరూ తమిళనాడుకు చెందిన వారన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రామస్వామి తెలిపారు.

పల్లెటూరి పిల్లలు.. చదువుల్లో విజేతలు

వివిధ అంశాల్లో రాణిస్తున్న బండారుపల్లి విద్యార్థులు

శ్రీకాళహస్తి(గ్రామీణం(ఏర్పేడు), న్యూస్‌టుడే: ఏర్పేడు మండలంలోని బండారుపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు చదువు, క్రీడల్లో రాణిస్తూ ఆదర్శవంతంగా నిలుస్తున్నారు. గ్రామీణ ప్రాతంలోని అరకొర వసతుల మధ్య విద్యనభ్యసిస్తున్నప్పటికీ రాష్ట్ర స్థాయిలో విజేతలుగా నిలుస్తున్నారు. మూడేళ్లుగా పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ఉత్తమ ప్రతిభతో జిల్లా స్థాయిలో మొదటి స్థానంలో నిలుస్తుండటమే కాకుండా పాఠశాలస్థాయి పరీక్షా పోటీల్లో తనదైన రీతిలో రాణిస్తున్నారు. వ్యాసరచన, క్విజ్, పాటల పోటీల్లోనూ ప్రతిభ చాటుతున్నారు. కబడ్డీ పోటీల్లో జిల్లా, రాష్ట్ర స్థాయిలో రాణించడం విశేషం. స్కౌట్స్ యూనిట్‌ను ప్రారంభించడంతో పిలల్లు గ్రామీణ ప్రాంతాల్లో పర్యటించి పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.



కలెక్టర్ డా.వెంకటేశ్వర్ నుంచి నగదు ప్రోత్సాహం అందుకుంటున్న విద్యార్థిని(పాత చిత్రం)

జాతీయ స్థాయిలో విజేతగా నిలవాలి




చదువుతో పాటు క్రీడలపై నిత్యం ప్రత్యేక శిక్షణ కల్పిస్తున్నారు. ఈ క్రమంలోనే ఇటీవల జరిగిన పాఠశాల కబడ్డీ పోటీల్లో జిల్లా స్థాయిలో రాణించడం ఆనందంగా ఉంది. మరింతగా శ్రమించి జాతీయ స్థాయిలో రాణించాలనే ఆశయంతో శ్రమిస్తున్నాం. **- గౌతమి, క్రీడాకారిణి**

అన్నిరంగాల్లో రాణించే విధంగా శిక్షణ



పల్లెటూరి పిల్లలు కావడంతో బయట ప్రపంచంతో పోటీ పడేందుకు కొంచెం వెనుకడుగు వేస్తుంటారు. దీన్ని గుర్తించి విద్యార్థుల్లో అన్నిరంగాల్లో రాణించే దిశగా శిక్షణ కల్పిస్తున్నాం. ఈ నేపథ్యంలోనే ఉత్తమ ఫలితాలతో విజేతలుగా నిలవడంతో సంతృప్తినిస్తోంది. చిన్నపాటి పోటీ పరీక్షలు జరిగినా విద్యార్థులు హాజరయ్యే విధంగా చర్యలు తీసుకోవడంతో సత్ఫలితాలను సాధిస్తున్నారు. **- సుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయులు**

రాష్ట్రస్థాయిలో రాణించడం ఆనందంగా ఉంది



పాఠశాల విద్యార్థులకు ఇటీవల నిర్వహించిన క్విజ్ పోటీల్లో రాష్ట్ర స్థాయిలో రాణించడం ఆనందంగా ఉంది. పాఠశాలలో చదువుతో పాటు వివిధ అంశాలపై చర్చాగోష్ఠి, సేవా కార్యక్రమాలు, విజేతలుగా నిలిచేందుకు తీసుకోవాల్సిన మెలకువలు గురించి ఉపాధ్యాయులు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తుంటారు. రాష్ట్ర, జిల్లా ఉన్నతాధికారుల నుంచి బహుమతులు అందుకోవడం ఆనందంగా ఉంది. **- చెంచమ్మ, విద్యార్థిని**

మహిళ మెడలో బంగారు గొలుసు అపహరణ

తొట్టంబేడు, న్యూస్‌టుడే: విధులు ముగించుకుని ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఇద్దరు మహిళలను అడ్డగించి ఓ మహిళ మెడలోని బంగారు గొలుసులను ఇద్దరు గుర్తు తెలియని యువకులు అపహరించిన ఘటన తొట్టంబేడు మండలంలో బుధవారం చోటుచేసుకుంది. ఎస్సై ఈశ్వరయ్య కథనం మేరకు.. శ్రీకాళహస్తి పట్టణంలో నివాసముంటున్న దేవి, సురేఖలు మండలంలోని కాసరం పీహెచ్‌సీ పరిధిలో ఏఎన్ఎం కార్యకర్తలుగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే పీహెచ్‌సీలో విధులు పూర్తి చేసుకుని తెలుగుగంగ కాలువపై శ్రీకాళహస్తి పట్టణానికి వెళ్తుండగా పిల్లమేడు సమీపంలో శిరస్త్రాణం ధరించిన ఇద్దరు గుర్తుతెలియని దుండగులు మహిళలు వెళ్తున్న ద్విచక్ర వాహనానికి అడ్డుపడి దేవి మెడలోని 35 గ్రాముల రెండు బంగారు గొలుసులను అపహరించారన్నారు. ఈ ఘటనపై బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

హత్య కేసులో వ్యక్తికి యావజ్జీవ శిక్ష

కేవీబీపురం, న్యూస్‌టుడే: మండలంలోని దిగువపూడికి చెందిన నాగేశ్(30)కు హత్యకేసులో యావజ్జీవ కారాగార శిక్ష పడింది. శ్రీకాళహస్తి 12వ జిల్లా అదనపు కోర్టు జడ్జి శ్రీనివాసనాయక్ బుధవారం తీర్పునిచ్చారు. 2019 ఫిబ్రవరిలో నాగేశ్ భార్యతో అదే గ్రామానికి చెందిన వంశీకృష్ణ అక్రమ సంబంధం కలిగి ఉన్నాడనే అనుమానంతో శరీర భాగాలను వేరు చూస్తూ అడవిలో దాచి పెట్టాడు. దీనిపై అప్పట్లో పోలీసులు కేసు నమోదు చేశారు. దీనిపై బుధవారం శ్రీకాళహస్తి కోర్టులో విచారణ జరిగి తుదితీర్పు ఇచ్చినట్లు ఎస్‌హెచ్‌వో విశ్వనాథం తెలిపారు.

గూడూరు

●గూడూరు ● వెంకటగిరి ● సూళ్లూరుపేట

కోళ్ల ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

బ్రాయిలర్	132
లేయర్	115
బ్రాయిలర్స్	236
బ్రాయిలర్స్ స్కిన్‌లెస్	262
లేయర్ మాంసం	195

భూ కొలతలు తగ్గాయంటూ వేడుకోలు

వాకాడు, న్యూస్‌టుడే: వాకాడు మండలంలోని నాగులమ్రి రెవెన్యూ పరిధిలో రెండు రోజులుగా స్థానిక ప్రాథమిక పాఠశాల ఆవరణలో నిర్వహించిన 'భూ సమస్యల పరిష్కార వేదిక'లో 10 మంది రైతులు రీసర్వేలో తమ భూముల కొలతలు తగ్గాయంటూ అర్జీలను తహసీల్దార్ రామయ్యకు సమర్పించారు. 15 రోజుల్లో సమస్యలు పరిష్కరిస్తామని రైతులకు హామీ ఇచ్చారు. ఉప తహసీల్దార్ సందీప్, ఆర్ఐ అఖిల్, మండల సర్వేయర్ శకుంతల, వీఆర్వో చిరంజీవి పాల్గొన్నారు.

స్థల పరిశీలన

కోట, న్యూస్‌టుడే: కోట మండలం గూడలిలోని స్వర్ణముఖినదిలో ఇసుక డంపింగ్ యార్డుకు తహసీల్దారు జయజయరావు, మైనింగ్ అధికారులు బుధవారం స్థల పరిశీలన చేశారు. అనువైన స్థలం కోసం ఆరా తీశారు. అధికారులను అడిగి పలు వివరాలు సేకరించారు. కార్యక్రమంలో మైనింగ్ ఏడీ శ్రీనివాసులు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.



స్వర్ణముఖిలో పరిశీలన చేస్తున్న అధికారులు



అన్న క్యాంటీన్‌లో భోజనాలు వడ్డిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

వెంకటగిరిలో అన్న క్యాంటీన్ ప్రారంభం

వెంకటగిరి గ్రామీణం: పేదల ఆకలి బాధలు తెలిసిన చంద్రబాబు అన్న క్యాంటీన్లు పెడితే జగన్ వాటిని ఎత్తేసి పేదల నోరు కొట్టారని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ పేర్కొన్నారు. వెంకటగిరిలో కలెక్టర్ వెంకటేశ్వర్‌తో కలిసి బుధవారం అన్న క్యాంటీన్‌ను ప్రారంభించారు. ఇద్దరూ కలిసి స్థానికులకు భోజనాలు వడ్డించారు. పాళెంకోట, చిలమనూరు, వెంగమాంబాపురం, హస్త కావేరి గ్రామాల్లో అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని కలెక్టర్‌కు ఎమ్మెల్యే విన్నవించారు. నాయకులు రాజేశ్వరరావు, గంగాధర్, మధురెడ్డి తదితరులు పాల్గొన్నారు. ● పట్టణంలోని 12వ వార్డు మల్లమ్మగుడివీధిలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. **బాలాయపల్లి:** వెంకటగిరిలో అన్న క్యాంటీన్ ప్రారంభోత్సవానికి హాజరైన కలెక్టర్ వెంకటేశ్వర్ బాలాయపల్లి తహసీల్దారు కార్యాలయానికి చేరుకొని అసైన్డ్ భూములకు హక్కులు కల్పించే నివేదికల్లో పొరపాట్లు ఏమైనా ఉన్నాయా? అనే అంశంపై వీఆర్వోలను ప్రశ్నించారు.

సొన కాలువలు కనుమరుగు

✷ 4 వేల ఎకరాల్లో సాగునీటికి అవస్థలు ✷ ఆందోళనలో ఆయకట్టు రైతులు



బల్లవోలులో మర్రి సొనకాలువ ఆనుకుని సిలికా తవ్వేయడంతో ఇలా..

చిల్లకూరు, న్యూస్‌టుడే: ఎటుచూసినా ఇసుక తిన్నెలు.. వాటి పొరల్లోంచి సొనకాలువల్లోకి జాలువారే జలాలు.. తద్వారా సాగయ్యే వేలాది ఎకరాల భూములు.. అన్నదాతల మోముల్లో విరిసిన నవ్వులు.. ఇవి తీర ప్రాంతానికి ప్రకృతి ప్రసాదించిన మణి మకుటాలు.. ఇది ఒకప్పటి మాట.. నేడు సాగునీటి సంగతి దేవుడికెరుక.. తాగునీటికి తీరవాసులు పడుతున్న అవస్థలు వర్ణనాతీతం. అక్కడ చెరువుల్లేవు. పంటల సాగుకు సొనకాలువలే ఆధారం. ఏటా రెండు పంటలకు సాగునీటిని పుష్కలంగా అందించిన సొనకాలువలు ప్రస్తుతం ఉనికిని కోల్పోయే పరిస్థితులు దాపురించాయి. వైకాపా హయాంలో ధనదాహంతో అడ్డూ అదుపు లేకుండా ఎక్కడ పడితే అక్కడ సాగించిన సిలికా దోపిడీకి ఇవి నిలువెత్తు సాక్ష్యాలుగా నిలుస్తున్నాయి.



కొత్త సొనకాలువలో ముందుకు కదలని నీరు..

సొనలే ఆధారం..

మండలంలోని చింతవరం, బల్లవోలు, వేళ్లపాలెం, తూర్పుకనుపూరు, అద్దేపల్లి, ఏరూరు, మోమిడి, వరగలి, లింగవరం తదితర తీరప్రాంత గ్రామాల్లో 18 వరకు సొనకాలువలు ఉన్నాయి. వీటి ఆధారంగానే సుమారు 4వేల ఎకరాల్లో అన్నదాతలు వరి సాగు చేస్తారు. గతంలో రైతులు కాలువలు తవ్వుకుంటే నీరు వచ్చే అవకాశం ఉండేది. కాల క్రమణా సిలికా తవ్వకాల కోసం అనుమతులు తీసుకున్న లీజుదారులు నిబంధనలకు విరుద్ధంగా 30 నుంచి 40 అడుగుల లోతు తవ్వకాలు జరిపి ఖనిజాన్ని తరలించేస్తున్నారు. దీంతో గుంతల్లో నీరు చేరి కాలువల్లోకి వచ్చే అవకాశం లేకుండా పోయింది. యంత్రాలను వినియోగించినా నీళ్ల రాని పరిస్థితి. కొన్ని సందర్భాల్లో చివరి తడులు అందక చేతికొచ్చిన పంటను కాపాడుకునేందుకు రైతులు అష్టకష్టాలు పడ్డ సందర్భాలు అనేకం.

ధనార్జనే ధ్యేయం..

గడిచిన అయిదేళ్లలో తీరప్రాంతంలో ధనార్జనే ధ్యేయంగా సిలికా తవ్వకాలు జరిగాయి. కాలువలకు ఇరువైపులా ఉన్న బఫర్‌జోన్‌ను వదలకుండా ఖనిజాన్ని తవ్వి అక్రమార్కులు రూ.కోట్లు సొమ్ము చేసుకున్నారు. పర్మిట్లు, సీనరేజి రూపేణా ప్రభుత్వ ఖజానాకు భారీగా ఆదాయం ఒనగూరినా రైతుల బాగుకోసం ఏమాత్రం పట్టించుకోలేదన్న ఆరోపణలున్నాయి. 2017లో అప్పటి ప్రభుత్వం నీరు-చెట్టు పథకం కింద కాలువల్లోని పూడికను తీయించిందని స్థానికులు చెబుతున్నారు. కాలువలను ఆనుకుని తవ్వకాలు జరపరాదని నిబంధనలు ఉన్నప్పటికీ ఏమాత్రం ఖాతరు చేయలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఫలితంగా సొనకాలువల ఉనికి ప్రశ్నార్థకంగా మారిందని అన్నదాతలు వాపోతున్నారు. ప్రస్తుత ప్రభుత్వం సొనల మరమ్మతులకు చొరవ చూపాలని వేడుకుంటున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

గూడూరు : 85002 02046
నాయుడుపేట: 80085 73970
సూళ్లూరుపేట: 96188 78782
వెంకటగిరి : 80085 73966
సమయం 10 AM TO 1 PM

బాలాయపల్లి, న్యూస్‌టుడే :

సమస్య: కయ్యూరు పంచాయతీ సుబ్రహ్మణ్యం గ్రామం నుంచి జయంపు వెళ్లే మలుపులో వర్షపు నీరు నిల్వ ఉంది. దుర్వాసనతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.
- పోలయ్య, సుబ్రమణ్యం గ్రామస్థుడు.

సమాధానం: సమస్యను పరిశీలించి త్వరితగతిన పరిష్కరిస్తాం. **- వినీల్ కుమార్, ఎంపీడీవో, బాలాయపల్లి**

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే:

సమస్య: గూడూరు పట్టణం శివాలయం వీధి ప్రాంతంలో వీధిదీపాలు వెలగకపోవడంతో రాత్రి సమయాల్లో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. అటుగా వెళ్లాలి అంటే పాదచారులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. **- జమాలుల్లా, గూడూరు**

సమాధానం: వెంటనే వీధి దీపాలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటాం. **- వెంకటేశ్వర్లు, కమిషనర్**

చెత్త తొలగింపు

స్పందనకు వందనం

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: పురపాలక పరిధిలోని రాణిపేట ప్రాంతంలో ప్రధాన రహదారిపై చెత్తాచెదారాలు ఉండడంతో 'మేమున్నాం.. మీకు తోడుగా' శీర్షికన 'ఈనాడు'లో వార్త ప్రచురితమైంది. స్పందించిన కమిషనర్ వెంకటేశ్వర్లు సిబ్బంది ద్వారా చెత్తాచెదారాలు తొలగించేలా చర్యలు తీసుకున్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్

సభ్యత్వ నమోదులో ప్రథమస్థానం సాధించాలి

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: తెదేపా సభ్యత్వ నమోదు విషయంలో రాష్ట్రంలో ప్రథమస్థానం సాధించేందుకు నాయకులు కలిసికట్టుగా కృషి చేయాలని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని తెదేపా కార్యాలయంలో సభ్యత్వ నమోదుపై నియోజకవర్గంలోని తెదేపా నాయకులతో సమీక్ష సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు శీలం కిరణ్‌కుమార్, నెలబల్లి భాస్కర్‌రెడ్డి, నల్లపరెడ్డి జగన్మోహన్‌రెడ్డి, బిల్లు చెంచురామయ్య, పులిమి శ్రీనివాసులు, కొండూరు వెంకటేశ్వర్లురాజు పాల్గొన్నారు.

తెదేపా కార్యకర్త మృతికి నివాళి

చిల్లకూరు: ముత్యాలపాడు పంచాయతీ పరిధిలోని నాంచారంపేటలో వైకాపా మూకల దాడిలో హత్యకు గురైన తెదేపా కార్యకర్త మల్లారపు హరిప్రసాద్ మృతదేహానికి ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్, వెంకటకోన ఆలయ మాజీ ఛైర్మన్ తానంకి నానాజీ, పలువురు పార్టీ నాయకులు బుధవారం నివాళి అర్పించారు.

సూళ్లూరుపేటలో జేసీ తనిఖీ

సూళ్లూరుపేట, న్యూస్‌టుడే: సూళ్లూరుపేటలో జాయింట్ కలెక్టర్ శుభం భన్సల్ బుధవారం పర్యటించారు. తహసీల్దార్, ఆర్డీవో కార్యాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందస్తు సమాచారం లేకుండా మధ్యాహ్నం సిబ్బంది, డీటీ విధులు నిర్వహించే భవనంలోకి వెళ్లారు. అనంతరం తహసీల్దార్ ఛాంబర్‌లోకి వెళ్లారు. పులికాట్ సరస్సుతోపాటు వట్రపాళెం గురించి వివరాలు తెలుసుకున్నారు. సిబ్బంది ఖాళీలపై ఆరా తీశారు. అక్కడి నుంచి శ్రీహరికోట రోడ్డులోని ఆర్డీవో కార్యాలయానికి వెళ్లారు.

'ఎస్సైపై చర్యలు తీసుకోవాలి'

సూళ్లూరుపేట, న్యూస్‌టుడే: న్యాయవాది పట్ల అనుచితంగా ప్రవర్తించిన ఎస్సై బ్రహ్మనాయుడుపై చర్యలు తీసుకునే వరకు ఆందోళన విరమించమని న్యాయవాదులు హెచ్చరించారు. ఈ మేరకు సూళ్లూరుపేటలో మూడో రోజూ బుధవారం న్యాయవాదులు నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా విధులు బహిష్కరించి, స్థానిక కోర్టు నుంచి ర్యాలీగా బయలుదేరి పుర వీధుల్లో నినాదాలు చేస్తూ ఆర్టీసీ బస్టాండ్ చేరుకున్నారు. మానవహారం చేపట్టారు.



పోలీసు రాణా వద్ద నిరసన తెలుపుతున్న న్యాయవాదులు



పరీక్ష రాస్తున్న విద్యార్థులు



విజేతలకు బహుమతులు అందిస్తున్న పాఠశాల యాజమాన్యం

వ్యాసరచన పోటీ.. ప్రతిభకి మేటి

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: పట్టణ సమీపంలోని గోగినేనిపురంలోని ఆదిశంకర ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో 'ఈనాడు' ఆధ్వర్యంలో 8, 9, 10 తరగతుల విద్యార్థులకు 'ప్రతిభా పాటవ' పోటీలను బుధవారం నిర్వహించారు. 'ఇంటర్నెట్ వల్ల కలిగే లాభ, నష్టాలు- విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు జరిగాయి. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను కె.పూజిత, బి.దివ్యతేజ, ఎస్.కె.సమీర గెలుపొందారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ సిహెచ్. రూపావతి, ఉపాధ్యాయులు శ్రీనివాసులుబాబు, వీరరాఘవయ్య, మనోహర్, కృష్ణయ్య, రేవతి పాల్గొన్నారు.

అవీ.. ఇవీ.. అన్నీ..

పొలం పిలుస్తోంది.. కోట: మండలంలోని కర్లపూడి, ఉత్తమనెల్లూరులో బుధవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని నిర్వహించారు. వ్యవసాయాధికారి నిరంజన్‌కుమార్ అన్నదాతలకు సుస్థిర వ్యవసాయంపై అవగాహన కల్పించారు.

జయంపులో ప్రతిష్ఠ.. జయంపు (బాలాయపల్లి): జయంపులో సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ బుధవారం ఘనంగా నిర్వహించారు. మొహిలే రమ్య గుడి వద్ద శిథిలావస్థలోని పురాతన రామ మందిరాన్ని తొలగించి దాతల సహకారంతో నూతన ఆలయాన్ని నిర్మించారు.

ప్రభాస్ జన్మదిన వేడుకలు.. వాకాడు: సినీస్టార్ ప్రభాస్ జన్మదిన వేడుకలను బుధవారం సాయంత్రం వాకాడులోని అశోక స్తంభం కూడలి వద్ద ఆయన అభిమానులు ఘనంగా నిర్వహించారు. కేక్ కోసి, బాణాసంచా కాల్చారు. **గూడూరు పట్టణం:** సినీ నటుడు ప్రభాస్ జన్మదిన వేడుకలను గూడూరులో ఆయన అభిమానులు ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే పాల్గొని కేక్ కోసి రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు.

కాలుష్యంపై అధికారుల పరిశీలన.. కోట: కోటలోని దాదారాయిగుంట సమీపంలోని అటుకల మిషను నుంచి వెలువడే పొగ కారణంగా స్థానికులు ఇబ్బందులు పడుతున్నారనే ఫిర్యాదులపై తహసీల్దారు జయజయరావు, ఎంపీడీవో వేణు బుధవారం పరిశీలించారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు.. కోట: చెందోడులో రూ.9.66లక్షల నిధులతో చేపడుతున్న రోడ్డు నిర్మాణానికి బుధవారం తెదేపా నాయకులు, అధికారులు శంకుస్థాపన చేశారు.

ఆకట్టుకున్న జిల్లాస్థాయి సైన్సు ప్రదర్శన.. నాయుడుపేట పట్టణం: నాయుడుపేట బాలుర గురుకులంలో బుధవారం జిల్లా స్థాయి సైన్సు ప్రదర్శన నిర్వహించారు. డిపార్ట్‌మెంట్ స్పేస్ డిప్యూటీ జనరల్ మేనేజరు సింగిరి రెడ్డప్ప సైన్సు విషయంలో విద్యార్థులు పోటీతత్వంతో ఉండాలన్నారు. డీఈవో పద్మజ జిల్లాస్థాయి సైన్సు ప్రదర్శనల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందించారు.

చెంగాళమ్మ ఆలయానికి కంప్యూటర్ వితరణ.. సూళ్లూరుపేట: పట్టణంలోని చెంగాళమ్మ ఆలయానికి బుధవారం స్థానిక వాసవి, వనిత క్లబ్ ప్రతినిధులు కంప్యూటర్‌ను వితరణ చేశారు. స్వర్గీయ శిశు మందిరానికి రెండు సీలింగ్ ఫ్యాన్లు, ఆట వస్తువులు అందించారు. కార్యక్రమంలో క్లబ్ అంతర్జాతీయ అధ్యక్షుడు రవిచంద్రన్, ప్రతినిధులు శబరీష్, సత్యనారాయణ, సాయిరాం, శ్రీనివాసులు, రమేష్, కాకి శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు.

ఎస్సీవీ నాయుడుతో తెదేపా నేతల భేటీ.. పెళ్లకూరు: శ్రీకాళహస్తి మాజీ శాసనసభ్యుడు ఎస్సీవీ నాయుడుతో పెళ్లకూరు మండలం తెదేపా మాజీ అధ్యక్షుడు పాపాడి రాజగోపాల్‌రెడ్డి బుధవారం భేటీ అయ్యారు. శ్రీకాళహస్తిలోని ఆయన నివాసంలో కలిసి మండలంలోని అభివృద్ధి పనులపై చర్చించినట్లు తెలిపారు.

టిడ్కో ఛైర్మన్‌కు అభినందనలు

వెంకటగిరి, న్యూస్‌టుడే: జనసేన జాతీయ మీడియా అధికార ప్రతినిధి వేములపాటి అజయ్‌కుమార్ బుధవారం టిడ్కో ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టారు. ఈ క్రమంలో వెంకటగిరి నియోజకవర్గం నుంచి జనసేన నేత తోట కృష్ణయ్య ఆధ్వర్యంలో నాయకులు విజయవాడకు తరలివెళ్లారు. అజయ్‌కుమార్ బాధ్యతలు చేపట్టిన అనంతరం కృష్ణయ్య, సహచర నేతలు ఘనంగా సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో నాయకులు తిరుపాల్, రవి పాల్గొన్నారు.



టిడ్కో ఛైర్మన్ అజయ్‌కుమార్‌ను అభినందిస్తున్న జనసేన నేతలు

టెబుల్ టెన్నిస్ పోటీలకు ఎన్‌బీకేఆర్ఐఎస్టీ విద్యార్థుల ఎంపిక

కోట, న్యూస్‌టుడే: మండలం విద్యానగర్‌లోని ఎన్‌బీకేఆర్ ఐఎస్టీకి చెందిన ముగ్గురు విద్యార్థులు దక్షిణ ప్రాంత అంతర రాష్ట్ర విశ్వవిద్యాలయ టెబుల్‌టెన్నిస్ క్రీడాపోటీలకు ఎంపికైనట్లు కళాశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి, పీడీ మల్లికార్జునరెడ్డి పేర్కొన్నారు. ఈ నెల 18న తిరుపతిలోని వెంకటేశ్వర కాలేజీ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాల క్రీడా మైదానంలో జరిగిన క్రీడాకారుల ఎంపికలో విద్యార్థులు వంశీధర్‌రెడ్డి, చందు, మహిళా విభాగంలో చందన ప్రతిభ చూపి అంతర రాష్ట్ర విశ్వవిద్యాలయ పోటీలకు ఎంపికైయ్యారన్నారు. బుధవారం విజేతలను అభినందించారు.

డీఎస్సీ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

సూళ్లూరుపేట, న్యూస్‌టుడే: డీఎస్సీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇచ్చేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సూళ్లూరుపేట ఏఎస్‌డబ్ల్యూ సుధామణి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. అర్హులైన ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు ఈ నెల 25 లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తాం

కోట: గూడూరు నియోజకవర్గ అభివృద్ధికి ప్రజలతో కలిసి పని చేస్తామని భాజపా రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు, సీనియర్ నాయకులు కొమారికోటేశ్వరరావు పేర్కొన్నారు. కోటలో బుధవారం ఆయన మాట్లాడుతూ.. తిరుపతి జిల్లాలోని గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాల్లో 75శాతం మంది ప్రజలు ఏ పార్టీకి చెందిన వారు కాదని.. ఎన్నికల్లో అభివృద్ధి చేసే వారికే ఓట్లు వేసి గెలిపిస్తుంటారన్నారన్నారు.

బాలిక అప్పగింత

దక్కిలి, న్యూస్‌టుడే: మండలంలోని గురుకుల పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న ఓ బాలిక అదృశ్యమైంది. బుధవారం సైదాపురం మండలం పోటెగుంట రోడ్ వద్ద బాలికను గుర్తించిన ప్రజలు బాలిక తల్లిదండ్రులకు సమాచారం అందించారు. ప్రజాసంఘాల నాయకులు బాలికను తల్లిదండ్రులకు అప్పగించారు.

ద్విచక్ర వాహనం చోరీ

సూళ్లూరుపేట: పట్టణంలోని సాయినగర్‌లో తన ఇంటి ముందు పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనం చోరీకి గురైందని బాధితుడు హేమగిరి బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సూళ్లూరుపేటలో..

సూళ్లూరుపేట: పట్టణంలో మంగళవారం అర్ధరాత్రి ఒకే వ్యక్తి రెండు చోట్ల చోరీలకు పాల్పడ్డాడు. పట్టణంలోని జీఎన్‌టీ రోడ్డులోని ఆంధ్ర స్టీల్ హార్డ్‌వేర్ దుకాణం తాళాలు పగులగొట్టి రూ.లక్ష నగదును గుర్తుతెలియని వ్యక్తి అపహరించుకుని వెళ్లాడు. గంటల వ్యవధిలోనే కోళ్లమిట్ట ప్రాంతంలో మరో దుకాణంలో రూ.20వేలు చోరీ చేశాడు. రెండు రోజుల కిందట శ్రీహరికోట రోడ్డులో పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనం చోరీకి గురైంది. వరుస దొంగతనాలు జరుగుతుండటంతో ప్రజలు హడలుతున్నారు.



తాళ్వాయపాడు వద్ద నిరసనలో స్థానికులు

బస్‌బే మార్చాలని స్థానికుల నిరసన

పెళ్లకూరు, న్యూస్‌టుడే: ఎన్‌హెచ్ 71పై బస్ బేని మార్చాలని బుధవారం తాళ్వాయపాడు రైతులు నిరసన వ్యక్తం చేశారు. గ్రామానికి చెందిన చిన్నకారు రైతుల భూమి కొంత కొంతగా బస్‌బే, సబ్‌వేల పేరిట స్థలం తీసుకోవడంపై స్థానికులు ఆగ్రహించారు. సబ్‌వే మార్చాలని అధికారులకు విన్నవించారు.

బీరు సీసాతో దాడి

నాయుడుపేట పట్టణం, న్యూస్‌టుడే: నాయుడుపేట మల్లాం జాతీయ రహదారి కూడలి సమీపంలో గురుప్రసాద్‌పై గురువయ్య అనే వ్యక్తి బీరుసీసాతో దాడి చేశారు. మండలంలోని పుదూరుకు చెందిన గురుప్రసాద్ నాయుడుపేటలో టైలర్‌గా పని చేస్తున్నారు. మంగళవారం రాత్రి ఇంటికి వెళ్తుండగా అదే గ్రామానికి చెందిన గురువయ్య పాత కక్ష్యలతో బీరు సీసాతో దాడి చేయడంతో గాయపడ్డాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ మృతి

సూళ్లూరుపేట, న్యూస్‌టుడే: సూళ్లూరుపేట-శ్రీకాళహస్తి రహదారిలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆర్టీసీ బస్సు ఢీకొని రోహిత్ మిత్ర తీవ్రంగా గాయపడ్డారు. చికిత్స నిమిత్తం తిరుపతిలోని ఆసుపత్రి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందారు.

ట్రాఫిక్ పద్మవ్యూహంలో నాయుడుపేట

నాయుడుపేట, న్యూస్‌టుడే: పట్టణంలోని బజారువీధులు ఆక్రమణలకు గురికావడంతో పురవాసులకు ట్రాఫిక్ సమస్యలు తప్పడం లేదు. పోలీసు, పురపాలక అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో బజారు వీధుల్లో ట్రాఫిక్ పద్మవ్యూహంలా మారింది.

నాయుడుపేట పట్టణం పలు మండలాలకు ప్రధాన కూడలి కావడం. దీనికి తోడు పారిశ్రామిక క్లస్టర్ ప్రాంతం కావడంతో బజారు వీధులు కొనుగోలుదారులు వివిధ రకాలు వాహనాల రాకపోకలతో నిత్యం రద్దీగా ఉంటుంది. ఇందుకు తగ్గట్లు రోడ్లు వెడల్పు లేకపోవడం.. ఉన్నా కొందరు ఆక్రమించి వ్యాపార కార్యకలాపాలు సాగించడంతో వాహనాలు నిలిపేందుకు చోదకులు నానా అవస్థలు పడుతున్నారు.



ఇరుకు రోడ్డులో ఆటో

తొలగించినా..

దర్గా వీధితోపాటు, ప్రధాన బజారు వీధుల్లో ఎనిమిదేళ్ల క్రితం ఇరువైపుల ఉన్న ఆక్రమణలను నాలుగు అడుగుల మేరకు తొలగించారు. మురుగు నీరు రోడ్డుపైకి రాకూడదని దుకాణదారులకు ఆంక్షలు విధించారు. కొంత కాలం సమస్య లేకుండా ఉన్నా.. వైకాపా ప్రభుత్వంలో ఆక్రమణల పట్ల పర్యవేక్షణ లేకపోవడంతో సమస్య యథావిధిగా మారింది.

తీవ్ర ఇబ్బంది

మరోవైపు పోలీసుల పర్యవేక్ష లేకపోవడంతో ద్విచక్రవాహనాలు, ఇతర భారీ వాహనాలు రోడ్లపై ఎక్కడికక్కడ ఉంచుతున్నారు. రైల్వేస్టేషన్ నుంచి బస్టాండ్ కూడలిలో అంబేడ్కర్ విగ్రహం వరకు జాతీయ రహదారి ఇరువైపుల ఆక్రమణలకు గురికావడం. ఉన్న కొద్దిపాటి రహదారిపై వాహనాలు బారులుగా నిలిపివేయడంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బంది ఉంటోంది.



బజారు వీధిలో ట్రాఫిక్

నిబంధనలు భేఖాతరు

పట్టణ ప్రధాన బజారు వీధుల్లో గతంలో ఒక వారం ఒక వైపు. మరో వారం ఇంకో వైపు ద్విచక్ర వాహనాలు పార్కింగ్ చేసేలా నిబంధనలు ఉండేవి.. ప్రస్తుతం ఇలాంటి నిబంధనలు అమలు చేయడం లేదు. గతంలో ఆటోలు పిల్లారి గుడి మీదుగా వెళ్లేవి.. ప్రస్తుతం బజారు మీదుగా వెళ్లడంతో ట్రాఫిక్ సమస్య నెలకొంటోంది. పెరుగుతున్న పట్టణీకరణకు అనుగుణంగా రోడ్లు వెడల్పు చేయక పోగా. ట్రాఫిక్ నిబంధనలు కూడా అమలు కాకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. కూటమి ప్రభుత్వం రోడ్ల ఆక్రమణ, ట్రాఫిక్ సమస్యలపై దృష్టి పెట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

శారదాపీఠం భూముల్లో అక్రమాలు అన్నీ ఇన్నీ కావు

రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్

ఈనాడు డిజిటల్, అమరావతి: శారదాపీఠం భూముల్లో సాగిన అక్రమాలు అన్నీ ఇన్నీ కావని రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. ఎకరం రూ.20 కోట్ల ధర పలికే భూమిని కేవలం రూ.లక్ష చొప్పున 15 ఎకరాలను అప్పనంగా కట్టబెట్టారని వివరించారు. వెలగపూడిలోని సచివాలయంలో ఆయన బుధవారం మాట్లాడారు. 'సాంస్కృతిక కళాశాల ఏర్పాటు పేరుతో భూములను తీసుకుని వాటిని శారదా పీఠానికి మళ్లించుకునేందుకు అక్రమాలు చేశారు. వాటిని గుర్తించాం కాబట్టే లీజును రద్దు చేశాం. ఎర్రమట్టి దిబ్బలను సైతం గత పాలకులు కొల్లగొట్టారు. అక్రమాలన్నింటిపై విచారణ చేసి తగు చర్యలు తీసుకుంటాం' అని స్పష్టం చేశారు.

పట్టాలపై గంజాయి సేవనం..

రైలు ఢీకొని ఇద్దరు విద్యార్థుల మృతి


కిరణ్‌కుమార్


యాసిన్

పీలేరు (గ్రామీణ, న్యూస్‌టుడే: పట్టాలపై కూర్చుని గంజాయి తీసుకుంటుండగా.. రైలు దూసుకురావడంతో ఇద్దరు విద్యార్థులు మృతి చెందారు. కదిరి రైల్వే పోలీసుల కథనం మేరకు... అన్నమయ్య జిల్లా పీలేరుకు చెందిన ఇంటర్ సెకండియర్ విద్యార్థి కిరణ్‌కుమార్ (18), అదే పట్టణానికి చెందిన ఇంటర్ ఫస్టియర్ విద్యార్థి యాసిన్ (17) మంగళవారం రాత్రి చిత్తూరు మార్గంలోని రైల్వే ట్రాక్‌పైకి వెళ్లి గంజాయి తీసుకోవడం మొదలుపెట్టారు. అదే సమయంలో నాగర్‌కోయిల్ నుంచి ముంబయి వెళ్లే రైలు వీరిపై నుంచి దూసుకెళ్లింది. గంజాయి మత్తులో రైలు వస్తున్న విషయాన్ని వారు గమనించకపోవడంతో ఈ ప్రమాదం జరిగింది. లోకో పైలట్ అందించిన సమాచారంతో సిబ్బంది అక్కడికి వెళ్లి చూడగా యాసిన్ చనిపోయి కనిపించాడు. కొన ఊపిరితో ఉన్న కిరణ్‌కుమార్‌ను తిరుపతి ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో కన్నుమూశాడు. ఇద్దరూ గంజాయికి అలవాటు పడ్డారని, వారి వద్ద గంజాయి పొట్లాలు దొరికాయని రైల్వే పోలీసులు తెలిపారు.

విద్యాసాగర్ పిటిషన్‌పై ముగిసిన వాదనలు

ఈనాడు, అమరావతి: ముంబయి సినీనటి కాదంబరి జెత్వానీ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఇబ్రహీంపట్నం పోలీసులు నమోదు చేసిన కేసులో విజయవాడ కోర్టు ఈ ఏడాది సెప్టెంబర్ 23న తనకు రిమాండ్ విధించడాన్ని సవాల్ చేస్తూ వైకాపా నేత కుక్కల విద్యాసాగర్ దాఖలు చేసిన వ్యాజ్యంలో బుధవారం హైకోర్టులో వాదనలు ముగిశాయి. తీర్పును రిజర్వు చేస్తున్నట్లు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీవీఎల్ఎన్ చక్రవర్తి ప్రకటించారు. సాధ్యమైనంత త్వరలో నిర్ణయాన్ని వెల్లడిస్తామన్నారు.



ఇతరులు బాధపడతారని క్షమాపణ చెప్పొద్దు

మీరు తప్పు చేసినప్పుడే క్షమాపణ చెప్పండి. మీ కోసం తీసుకొనే నిర్ణయాలతో ఎదుటివారు బాధపడతారన్న ఆలోచనతో మాత్రం క్షమాపణ చెప్పకండి. అది వారి సమస్యే తప్ప మీది కాదు. మీరేదైనా కొత్తగా ప్రయత్నించి విఫలమైనప్పుడు, మీరేం కోరుకుంటున్నారో చెప్పినప్పుడు, మీ అభిప్రాయాన్ని వెల్లడించినప్పుడు, కుటుంబంతో గడపడానికి పనికి దూరంగా ఉండాల్సి వచ్చినప్పుడు మీరు తప్పు చేసినట్లు కాదు. ఆ సందర్భాల్లో ఎవ్వరికీ క్షమాపణలు చెప్పాల్సిన అవసరం లేదు.

– డేనియల్ ఆరోన్, రచయిత

స్వామి అడుగులకు మడుగులు!

- భూముల కేటాయింపులో ఉల్లంఘనలు
- ట్రస్టీ పేరుతో అభ్యర్థన.. ఉత్తరాధికారి పేరుతో కేటాయింపులు
- నాటి వైకాపా పాలనలో సర్వం మాయ

ఈనాడు-అమరావతి, విశాఖపట్నం: వివాదాస్పద పీఠాధిపతి స్వరూపానందేంద్రకు చెందిన శారదా పీఠానికి నాటి వైకాపా ప్రభుత్వం అడుగడుగునా వత్తాసు పలికింది. రూ.225 కోట్ల విలువచేసే 15 ఎకరాలను.. నిబంధనలు ఉల్లంఘించి రూ.15 లక్షలకు కట్టబెట్టారు. ఒకసారి ఉత్తరాధికారి, మరోసారి ట్రస్టీ పేరుతో వ్యవహారాలు నడిపి గందరగోళానికి తెరతీశారు. అభ్యర్థన ఒకరి పేరుతో రాగా.. కేటాయింపు మరొకరి పేరున జరిగింది. గత జులై 15న ముఖ్యమంత్రి చంద్రబాబు 'సహజ వనరుల దోపిడీ' పేరుతో విడుదల చేసిన శ్వేతపత్రంలో శారదా పీఠానికి కేటాయించిన భూముల వ్యవహారంపై కఠిన చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. తదుపరి చర్యల్లో భాగంగా కలెక్టర్ నుంచి అందిన నివేదికపై మంత్రివర్గంలో చర్చించి ఎన్డీయే ప్రభుత్వం రద్దుచేసింది. భూముల కేటాయింపులో విశాఖ జిల్లా అధికార యంత్రాంగం గుర్తించిన ప్రధాన ఉల్లంఘనలు ఇవీ..

★ నిబంధనల ప్రకారం ట్రస్టు నిర్వాహకులు, పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి పేరున కాకుండా పీఠం ఉత్తరాధికారి పేరున ఆ భూములను బదలాయించకూడదు.

★ తొలుత 2.9.2021న పీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి 15 ఎకరాలు కావాలని అభ్యర్థించారు. శాశ్వత బదలాయింపు కోసం ఉత్తరాధికారి ఫారం-29లో వివరాలు పూర్తిచేసి సమర్పించాల్సి ఉన్నా.. అవేమీ చేయలేదు.

★ అప్పటి ప్రభుత్వం స్వాత్మానందేంద్ర అభ్యర్థన మేరకు 24.10.2021లో భూములు బదలాయింపు జీఓ 571 ఇచ్చేసింది. ఆ తర్వాత పీఠం ట్రస్టీ చాగంటి ప్రకాశరావు ఫారం-29లో వివరాలు నింపి దరఖాస్తు చేశారు.

★ 29.11.2021న శారదా పీఠం ట్రస్టీ పేరున భూమిని బదలాయిస్తూ జీఓ 343ను ఇచ్చింది. వాస్తవానికి ఫారం-29 ఎవరు సమర్పిస్తారో వారి పేరున బదలాయించాలి. ఇక్కడ ట్రస్టీ చేయడంతో ఆయన పేరున జీఓ ఇచ్చారు. మొదట ఉత్తరాధికారి పేరున ఒక జీఓ ఇచ్చి, ట్రస్టీ పేరున మరొకటి విడుదల చేశారు.

★ తర్వాత భూముల్లో నిర్మాణాలు చేపట్టేందుకు వీలుగా, సర్వే నంబర్లు మార్చి ఇవ్వాలని శారదా పీఠం ట్రస్టీ అప్పటి రెవెన్యూ ఉన్నతాధికారులకు లేఖ రాశారు.

★ వెంటనే రెండు సర్వే నంబర్లలో ఉన్న భూములను ఒకే సర్వే నంబరు కింద మార్చి సవరించిన ఉత్తర్వులను ట్రస్టీ పేరున ఇచ్చారు. శాశ్వత బదలాయింపు ఉత్తర్వుల్లో స్వాత్మానందేంద్ర సరస్వతి పేరున ఇచ్చిన దాంట్లోనూ మార్చారు. 8.2.2022న నాటి ప్రభుత్వం 343 బదలాయింపు ఉత్తర్వులను సవరించి కొత్తగా శారదా పీఠం ఉత్తరాధికారి పేరున జీఓ 64ను కొత్తగా ఇచ్చింది. ఇలా ఒక్కోసారి ఒక్కొక్కరి పేరున నచ్చినట్లు ఉత్తర్వులు వెలువడ్డాయి.

★ 20.11.2023న ఆధ్యాత్మిక, ట్రస్టు అవసరాల కోసం ఈ భూమిని ఆదాయ వనరుగా మార్చుకునేందుకు ప్రయత్నించారు. అందుకోసం అప్పటి ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శికి పీఠం ఉత్తరాధికారి లేఖ రాశారు. వడ్డించే వాడు మనవాడైతే అన్నీ వస్తాయన్నట్లుగా ఒక రాయి వేశారు.


★ ఆ ప్రతిపాదించిన స్థలంలో ఘాట్ రోడ్డు నిర్మించేశారు. ప్రస్తుతం ఒక బోరు, షెడ్డు ఉంది.

రేపటి నుంచి మంత్రి లోకేశ్ అమెరికా పర్యటన

జార్జియాలో ఐటీ సర్వ్ సినర్జీ సదస్సులో కీలక ప్రసంగం


ఈనాడు డిజిటల్, అమరావతి: విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేశ్ శుక్రవారం నుంచి వచ్చే నెల 1 వరకు అమెరికాలో పర్యటించనున్నారు. ఆయా తేదీల్లో పలు సంస్థల ప్రతినిధులతో సమావేశమై రాష్ట్రంలో పెట్టుబడులకు గల అనుకూలతలపై చర్చిస్తారు. ఇందులో భాగంగా శాన్‌ఫ్రాన్సిస్కోలో ఒరాకిల్ సంస్థ ప్రతినిధులు, పెట్టుబడిదారులు, పారిశ్రామికవేత్తలతో 25న సమావేశమవుతారు. పత్ర సినర్జీస్, బోసన్, స్పేస్‌ఎక్స్, ఫ్లాటెల్, ఎవోల్, స్పైలర్, జనరల్ అటామిక్స్ సంస్థల ప్రతినిధులు, భారత కాన్సుల్ జనరల్‌తో 26న భేటీ అవుతారు. ఆస్టిన్‌లోని పలు కంపెనీల ప్రతినిధులతో 27న, రెడ్‌మండ్‌లో మైక్రోసాఫ్ట్ ప్రతినిధులతో 28న భేటీ కానున్నారు. 29న అమెజాన్ సహా పలు కంపెనీల ప్రతినిధులతో సమావేశం కావడంతోపాటు ఐటీ సర్వ్ సినర్జీ సదస్సులో కీలక ప్రసంగం చేయనున్నారు. ఈ నెల 30న కూడా వివిధ కంపెనీల ప్రతినిధులతో భేటీ అవుతారు. 31న జార్జియాలో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తారు. న్యూయార్క్‌లో పెట్టుబడిదారులతో నవంబరు 1న సమావేశమవుతారు.

పొట్ల కాదు వంకాయే!



శ్రీకాకుళం జిల్లా సారవకోట మండలం సవరద్దపనస గ్రామానికి చెందిన బీడీ విశ్వప్రసాద్ ఇంటి ఆవరణలోని ఓ వంగ మొక్క అడుగున్నర పొడవైన కాయ కాసింది. కర్ణాటకకు చెందిన ఓ రైతు దేశీయ కూరగాయలు సాగు చేస్తున్నట్లు విశ్వప్రసాద్ యూట్యూబ్‌లో చూసి తెలుసుకున్నారు. ఆయన నుంచి 'ఇల్లీకుంబన్ ఎగ్ ప్లాంట్' రకం విత్తనాలు కొని, పోస్టులో తెప్పించుకున్నారు. వాటిని సేంద్రియ విధానంలో పెంచగా పొడవైన కాయ కాసింది. కేరళకు చెందిన ఈ రకం వంగ సాధారణంగానే పొడవైన కాయలు ఇస్తుందని ఉద్యాన అధికారిణి మంగమ్మ తెలిపారు. – న్యూస్‌టుడే, సారవకోట





డ్రైవింగ్ లైసెన్స్‌లో అవయవదానం వివరాలు

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: డ్రైవింగ్ లైసెన్స్‌లో డ్రైవర్ వివరాలతో పాటు సామాజిక అంశాలకు కొత్తగా ప్రాధాన్యం ఇచ్చారు. డ్రైవర్ పేరు, చిరునామా, పుట్టిన తేదీ, అర్హత పొందిన వాహనం స్వభావం వివరాలతో పాటు అవయవదానం చేయడానికి సిద్ధంగా ఉన్నారా? అనే విషయాన్ని ఇటీవల ముద్రించారు. వీటితో పాటు డ్రైవర్ రక్త గ్రూపు, అత్యవసర పరిస్థితుల్లో సంప్రదించాల్సిన కుటుంబ సభ్యుల ఫోన్ నంబర్, అర్హత పొందిన వాహనాల చిత్రాలనూ ముద్రించారు. దీనివల్ల ప్రమాదం జరిగిన సమయంలో సమాచారం ఇవ్వడానికి ఉపయోగపడుతుందని అధికారులు చెబుతున్నారు.

రాజ్యలక్ష్మి దాతృత్వం ఆదర్శప్రాయం

- సెంట్రల్ జీఎస్టీ కమిషనర్ సాధు నరసింహారెడ్డి


అమ్మ ఛారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి అయ్యప్పరాజుకు రూ.15 లక్షల చెక్కు అందిస్తున్న జీఎస్టీ కమిషనర్ నరసింహారెడ్డి, సావిత్రమ్మ తదితరులు

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: బ్యాంకులో దాచుకున్న రూ.61 లక్షల నగదును తన మరణానంతరం సామాజిక, స్వచ్ఛంద సేవా సంస్థలకు దానం చేసిన జీఎస్టీ విశ్రాంత సూపరింటెండెంట్ శిష్ట్లా రాజ్యలక్ష్మి దాతృత్వం అందరికీ ఆదర్శప్రాయమని సెంట్రల్ జీఎస్టీ కమిషనర్ సాధు నరసింహారెడ్డి అన్నారు. గుంటూరు కన్నావారితోటలోని జీఎస్టీ భవన్‌లో నరసింహారెడ్డి చేతుల మీదుగా వివిధ సేవా సంస్థలకు బుధవారం చెక్కులు అందజేశారు. నరసింహారెడ్డి మాట్లాడుతూ రాజ్యలక్ష్మి ఆదర్శ నిర్ణయం ఇతరులకు స్ఫూర్తిదాయకమన్నారు. ఆమె భౌతికంగా లేనప్పటికీ, తన దాతృత్వం ద్వారా అందరికీ మార్గదర్శిగా మిగిలిపోతారన్నారు. అనంతరం రాజ్యలక్ష్మి రాసిన వీలునామా ప్రకారం అమ్మ ఛారిటబుల్ ట్రస్టుకు రూ.15 లక్షలు, శిర్డీ సాయి సేవా ట్రస్ట్‌కు రూ.10 లక్షలు, శిష్ట్లా రాజ్యలక్ష్మి పేరుతో ఏర్పాటైన మెమోరియల్ ట్రస్ట్‌కు రూ.36 లక్షలు (చెక్కుల రూపంలో) రాజ్యలక్ష్మి తల్లి సావిత్రమ్మ సమక్షంలో ఆయా సంస్థల ప్రతినిధులు అయ్యప్పరాజు, దేవరశెట్టి సురేష్, చిట్టె వెంకట్‌లకు అందజేశారు. కార్యక్రమంలో రాజ్యలక్ష్మి సోదరుడు రామకృష్ణ, ఐఆర్ఎస్ అధికారులు బి.లక్ష్మీనారాయణ, వి.వెంకటేశ్వరరావు, మనోజ్‌కుమార్, కమల్ సీనా, రవికుమార్, నాగరాజు, జీఎస్టీ అధికారులు సీహెచ్. వెంకటేశ్వరరావు, గాదె శ్రీనివాసరెడ్డి, సీహెచ్. ఈశ్వర్, యుగంధర్, మూర్తి, పింఛనర్ల సంఘం తరపున వివేకానంద, పీవీ సత్యనారాయణ, గుమ్మడి సీతారామయ్య చౌదరి తదితరులు పాల్గొన్నారు.

త్వరలో చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు: మంత్రి సవిత

ఈనాడు, అమరావతి: త్వరలో చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు చేనేత, జౌళిశాఖ మంత్రి సవిత తెలిపారు. చేనేత వస్త్రాలపై జీఎస్టీని రీయింబర్స్‌మెంట్ చేయనున్నట్లు వెల్లడించారు. ట్రెండ్‌కు తగ్గట్టుగా నేత కార్మికులకు శిక్షణ ఇచ్చి మార్కెటింగ్ సదుపాయం కల్పిస్తామన్నారు. మంగళగిరిలోని చేనేత కార్యాలయంలో బుధవారం వివిధ జిల్లాల డీడీలు, ఏడీలతో ఆమె సమీక్ష నిర్వహించారు. 'చేనేత మగ్గాలకు 200 యూనిట్లు, మరమగ్గాలకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు అందించేందుకు కసరత్తు ప్రారంభించాం. చీరాలలో నూతనంగా టెక్స్‌టైల్స్ పార్కును ఏర్పాటు చేస్తాం' అని పేర్కొన్నారు.

వైకాపా హయాంలో.. రౌడీలను పెంచి పోషించారు

మాజీ మంత్రి పీతల సుజాత

ఈనాడు డిజిటల్, అమరావతి: వైకాపా హయాంలో గంజాయి సాగును నియంత్రించకపోగా, రౌడీమూకలను పెంచి పోషించారని మాజీ మంత్రి పీతల సుజాత విమర్శించారు. అందుకే రాష్ట్రంలో ప్రస్తుతం హత్యాచారాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఎన్డీయే ప్రభుత్వం వచ్చాక మత్తు పదార్థాల అమ్మకం, వినియోగంపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఉక్కుపాదం మోపుతున్నారని స్పష్టం చేశారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో బుధవారం ఆమె విలేకర్లతో మాట్లాడారు.

విశాఖ ఉక్కులో వీఆర్ఎస్ ప్రతిపాదన విరమించుకోవాలి: సీపీఎం

ఈనాడు, అమరావతి: విశాఖ ఉక్కు కర్మాగారంలో స్వచ్ఛంద పదవీ విరమణ ప్రతిపాదనను విరమించుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. "విశాఖ ఉక్కు కర్మాగారంలో సర్వే పేరుతో ఉద్యోగులకు వీఆర్ఎస్ ఇచ్చి సాగనంపడాన్ని వ్యతిరేకిస్తున్నాం. ఉద్యోగులందరూ వీఆర్ఎస్ విధానాన్ని పూర్తిగా వ్యతిరేకించాలి. కార్మికుల పోరాట ఫలితంగా రెండో బ్లాస్ట్‌ఫర్నేస్ తెరుస్తున్న సమయంలో ఈ చర్య ఉత్పత్తిని దెబ్బకొడుతుంది. సెయిల్‌లో విలీనం చేయకుండా వీఆర్ఎస్‌ను ప్రవేశపెట్టడాన్ని కార్మికులు ప్రతిఘటించాలి" అని సూచించారు.

నగరంలో భారీ వర్షం


గోవిందరాజ స్వామి సత్రాల రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద వర్షపు నీటిలో రాకపోకలు

ఈనాడు, తిరుపతి: నగరంలో బుధవారం రాత్రి 9.30 గంటల నుంచి సుమారు రెండు గంటల పాటు భారీ వర్షం కురిసింది. రోడ్లన్నీ జలమయమయ్యాయి. అండర్ బ్రిడ్జిల వద్ద భారీగా చేరిన వర్షం నీటిలోనే వాహన చోదకులు రాకపోకలు సాగిస్తూ కనిపించారు. పలు కాలనీలు, ప్రధాన రహదారుల్లో వర్షపు నీరు చెరువులను తలపించింది.

తలకోనలో కొట్టుకుపోయిన తాత్కాలిక కోనేరు

యర్రావారిపాలెం, న్యూస్‌టుడే: తాజా వర్షాలకు తలకోన శ్రీసిద్ధేశ్వరస్వామి దేవాలయం ముందు ఏర్పాటుచేసిన తాత్కాలిక కోనేరు గట్లు పూర్తిగా కొట్టుకుపోయాయి. గతంలో శాశ్వత నిర్మాణానికి ప్రతిపాదనలు చేసినా ఇప్పటికీ కార్యరూపం దాల్చలేదు. ప్రస్తుతం తలకోన అడవుల్లో తమిళ సినీ హీరో కార్తి నటిస్తున్న సర్దార్-2 చిత్రీకరణ జరుగుతుండటంతో తలకోనలో సందడి నెలకొంది.

బాల్య వివాహాలు అరికట్టేందుకు కృషిచేయాలి

తిరుపతి (కలెక్టరేట్), న్యూస్‌టుడే: బాల్య వివాహాలు అరికట్టేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని డీఆర్వో పెంచల కిషోర్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి అధికారుల సమావేశం నిర్వహించారు. డీఎంహెచ్‌వో డా.శ్రీహరి, జిల్లా స్త్రీ, శిశుసంక్షేమశాఖ అధికారి జయలక్ష్మి, డీఎస్పీ శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

ట్రెండ్స్ భవనాలు.. అక్రమాలకు నిలయాలు

ప్రభుత్వ అవసరాలకు సద్వినియోగం ఏదీ?


మంగళంలోని అగ్గిపుల్లల కర్మాగార భవనం


వాహనాల పార్కింగ్ కోసం అక్రమంగా ఉపయోగించుకుంటున్న దృశ్యం

తిరుపతి (మంగళం), న్యూస్‌టుడే: మంగళం పరిధిలోని విలువైన ప్రభుత్వ భవనాలు, రూ.కోట్ల విలువచేసే భూములు, దుకాణ సముదాయాలు వృథాగా మారాయి. నాలుగు దశాబ్దాలుగా ఇదే దుస్థితి. ప్రభుత్వ అవసరాలకు వాటి అవసరం ఉన్నా అధికారులు వీటిని పరిశీలించిన దాఖలాలు లేవు. దీంతో భవనాలు, దుకాణాల్లో కొన్ని శిథిలావస్థకు చేరుకోగా, మరికొన్ని అసాంఘిక కార్యక్రమాలకు, అనధికార దుకాణాల నిర్వహణకు నిలయాలుగా మారిపోయాయి. అనధికారికంగా అద్దెలు వసూలు చేసుకుంటున్నారు. ఖాళీ భూములను ఆక్రమించుకోవడానికి పాగా వేసేస్తున్నారు.

మంగళంలో గ్రామీణ యువతీయువకులకు జీవనోపాధులు కల్పించే ఉద్దేశంతో 1982లో ట్రెండ్స్ అనే సంస్థను అప్పటి ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ప్రస్తుతం ఉన్న సెట్విన్ తరహాలోనే సంస్థ పనిచేసింది. 30 రకాల చేతివృత్తుల్లో శిక్షణ ఇచ్చేవారు. పదెకరాల్లో పక్కా భవనాలు నిర్మించగా వాటిని బీసీ, ఎస్సీ కార్పొరేషన్లు, లిడ్‌క్యాప్ సంస్థలు నిర్వహించేవి. కొన్నేళ్ల తరువాత ట్రెండ్స్ సంస్థ మూతపడటంతో భవనాలు నిరుపయోగంగా మారాయి.

- మంగళం క్వార్టర్స్‌లో తిరుపతి-కరకంబాడి మార్గాన్ని అనుకుని అర ఎకరా భూమిలో అడ్మినిస్ట్రేషన్ భవనం, పక్కనే చాక్‌పీస్‌ల తయారీ కేంద్రం ఉన్నాయి. వీటికి కొంత దూరంలో 200 అంకణాల భూమిలో అగ్గిపుల్లల తయారీ కేంద్రం ఉంది. అక్కడి నుంచి ఫర్లాంగు దూరంలో 300 అంకణాల్లో బీసీ, ఎస్సీ కార్పొరేషన్లు నిర్వహించిన దుకాణాలు, సముదాయాలు ఉన్నాయి. వీటికి సమీపంలో మరో 4 ఎకరాల విస్తీర్ణంలో ప్రస్తుతం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భవనాలున్నాయి. తిరుమలనగర్ సమీపంలో సుమారు ఐదెకరాల విస్తీర్ణంలో బీరువాలు, ఫర్నిచర్ తయారీ కేంద్రం ఉంది. ప్రస్తుతం వాటిలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నిర్వహిస్తున్న భవనాలు మాత్రమే వినియోగంలో ఉన్నాయి. మిగిలిన భవనాలు, భూమి నిరుపయోగంగానే ఉన్నా పట్టించుకున్న దాఖలాలు కనిపించడం లేదు. జిల్లాల పునర్విభజన నేపథ్యంలో తిరుపతి పరిధిలో ప్రభుత్వ కార్యకలాపాలు నిర్వహించేందుకు భవనాలు, భూమి అవసరం ఉంది. పలు కార్యాలయాలను ప్రైవేటు భవనాల్లో నిర్వహిస్తున్న దాఖలాలున్నాయి. ఫైర్ స్టేషన్ వంటి ప్రభుత్వ కార్యాలయాలను నగరానికి దూరంగా తరలించాలని ఏళ్లుగా భూమికోసం వెతుకుతున్న రెవెన్యూ అధికారులకు ఈ భవనాలు, ఇక్కడి భూమి కనిపించడం లేదు. దీంతో అక్రమార్కులు ఆక్రమించుకోవడం, భవనాలను అనధికారికంగా అద్దెలకు ఇచ్చుకోవడం, అసాంఘిక కార్యక్రమాలకోసం వాడుకోవడం పెరిగింది.

చంద్రగిరిని ఆదర్శంగా తీర్చిదిద్దడమే లక్ష్యం


కార్యకర్త కుటుంబానికి చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే పులివర్తి నాని

రామచంద్రాపురం: ప్రతి పంచాయతీని అభివృద్ధి చేస్తూ చంద్రగిరి నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలపాలన్నదే ధ్యేయమని ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. బుధవారం పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా మిట్టకండ్రిగ, కొత్తకండ్రిగ, కుప్పంబాదూరు, రాయలచెరువు, సి.కాలేపల్లి, నెతకుప్పం, కొత్త వేపకుప్పం, అనుపల్లి పంచాయతీలో రూ.2.60 కోట్లతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, భూమిపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. నేతలు తిరుమలరెడ్డి, జనార్దన్ చౌదరి, చినబాబు, హరిప్రసాద్ నాయుడు, కేశవుల నాయుడు, బిందు మాధవి, జేడీ జగన్ తదితరులు పాల్గొన్నారు.

● రూ.2 లక్షల చెక్కు అందజేత: నెత్తకుప్పంలో ఇటీవల జరిగిన గంగజాతరలో మృతిచెందిన గోపి కుటుంబానికి రూ.2 లక్షల పరిహారం చెక్కును తెదేపా మండల అధ్యక్షుడు తిరుమలరెడ్డి, జిల్లా కార్యదర్శి జేడీ జగన్ సమక్షంలో గోపి భార్య ఈశ్వరికి ఎమ్మెల్యే పులివర్తి నాని అందజేశారు.

అప్రమత్తంగా విధులు నిర్వహించాలి

తిరుపతి (బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: తితిదే ఉద్యోగుల సహకార ఎన్నికలకు సంబంధించిన విధి నిర్వహణలో సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని జిల్లా సహకార శాఖ అధికారిణి లక్ష్మి తెలిపారు. ఈనెల 28వ తేదీన జరిగే ఎన్నికలపై బుధవారం శిక్షణ నిర్వహించారు. అసిస్టెంట్ రిజిస్ట్రార్ నాగభూషణం ఎన్నికలకు నిబంధనలను వివరించారు. ఎన్నికల అధికారి ఉమాపతి మాట్లాడారు. అసిస్టెంట్ రిజిస్ట్రార్ మద్దిపట్ల వెంకటరమణ, సహకార సిబ్బంది పాల్గొన్నారు.

కపిలేశ్వరాలయంలో భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి


జలాశయాన్ని సందర్శిస్తున్న ఈవో శ్యామలరావు

తిరుపతి (బైరాగిపట్టెడ): కపిలేశ్వర స్వామివారి ఆలయానికి కార్తిక మాసంలో విశేష సంఖ్యలో విచ్చేసే భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా చర్యలు తీసుకోవాలని తితిదే ఈవో జె.శ్యామలరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం ఆలయాన్ని, పుష్కరిణిని ఆయన సందర్శించారు. పారిశుద్ధ్యం, క్యూలైన్ల నిర్వహణపై సూచనలు చేశారు. ఆలయ డిప్యూటీ ఈవో దేవేంద్రబాబు, డీఎఫ్‌వో శ్రీనివాసులు ఇతర అధికారులు పాల్గొన్నారు.

దైవిక స్నేహితుడు శ్రీకృష్ణుడు

మహిళా వర్సిటీ(తిరుపతి): శ్రీకృష్ణుడు తన భక్తులకోసం ఎల్లప్పుడూ వెంట ఉండే దైవిక స్నేహితుడని రష్యా నుంచి విచ్చేసిన శ్రీల ప్రభుపాద శిష్యురాలు మందాకిని మాతాజీ అన్నారు. పద్మావతి మహిళా జూనియర్ కళాశాలలో బుధవారం అంతర్జాతీయ కృష్ణచైతన్య సంఘం ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం రష్యానుంచి విచ్చేసిన కృష్ణ భక్తులతో కలిసి ప్రవచనాలు, గీతాలను ఆలపించారు. ప్రిన్సిపల్ భువనేశ్వరిదేవి పాల్గొన్నారు.

పవిత్రాల సమర్పణ

చంద్రగిరి, న్యూస్‌టుడే: శ్రీకోదండరామ స్వామివారి దేవాలయంలో నిర్వహిస్తున్న పవిత్రోత్సవాల్లో భాగంగా బుధవారం పవిత్ర సమర్పణ వైభవంగా చేపట్టారు. సూపరింటెండెంట్ జ్ఞానప్రకాష్, ఆలయ ఇన్‌స్పెక్టర్ శ్రీహరి పాల్గొన్నారు.

30న దీపావళి ఆస్థానం

తిరుపతి (బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: శ్రీగోవిందరాజ స్వామివారి ఆలయంలో ఈనెల 30వ తేదీన దీపావళి సందర్భంగా సాయంత్రం 4 నుంచి 5.30 గంటల వరకు ఆస్థానం జరుగనుంది. 24వ తేదీన కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించనున్నారు.

ఆయుర్వేదంతో ఆరోగ్యం

తిరుపతి (మహిళా వర్సిటీ), న్యూస్‌టుడే : ఆయుర్వేద వైద్యంతో ఆరోగ్యంగా ఉండచ్చని ఆయుర్వేద వైద్య నిపుణురాలు పవిత్ర అన్నారు. శ్రీ పద్మావతి మహిళా వర్సిటీ మహిళా అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం స్థానిక శ్రీనివాస నగర్‌లోని కమ్యూనిటీ హాల్లో 'ఆరోగ్య సమస్యలు- పరిష్కార మార్గాలు' అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కేంద్రం అసిస్టెంట్ ప్రొఫెసర్ రాణి, సిబ్బంది పాల్గొన్నారు.

ఎరువుల యాజమాన్యంతో సుస్థిర దిగుబడులు

పాకాల, న్యూస్‌టుడే: పంటలకు అవసరమైన ఎరువుల యాజమాన్యంతోనే సుస్థిర దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి పుష్పావతి అన్నారు. జిల్లా వనరుల కేంద్రం ఆధ్వర్యంలో మండలంలోని అమ్మగారిపల్లిలో బుధవారం నిర్వహించిన రైతు శిక్షణ తరగతుల్లో ఆమె పాల్గొన్నారు. **యర్రావారిపాలెం :** రైతులు మూసపద్ధతిలో వ్యవసాయం చేయడం కాకుండా పంటమార్పిడి పద్ధతులను అవలంబిస్తే మంచి దిగుబడులతో లాభాలను ఆర్జించగలరని ఏవో ఖాదర్‌బాషా తెలిపారు. బోడేవాండ్లపల్లి, వీఆర్ అగ్రహారం గ్రామాల్లో బుధవారం పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల వ్యవసాయశాఖ అధికారి ఖాదర్‌బాషా, ఉద్యానవనశాఖ అధికారిణి శివకుమారి పాల్గొన్నారు.

కేబీఆర్ నగర్‌లో సర్వే..

తిరుపతి(మంగళం), న్యూస్‌టుడే: మంగళం సమీపంలోని కేబీఆర్‌నగర్ (డ్రైవర్స్ కాలనీ)లో రెవెన్యూ అధికారులు బుధవారం సర్వే నిర్వహించారు. గ్రామ సరిహద్దులు, శ్మశాన భూమికి సంబంధించిన సమస్య తలెత్తడంతో అధికారులు సమగ్ర సర్వేకు చర్యలు ప్రారంభించారు.

వీఆర్వోలకు ఎమ్మెల్యే పరామర్శ

చంద్రగిరి గ్రామీణ: పూతలపట్టు- నాయుడుపేట జాతీయ రహదారిపై బుధవారం రాత్రి తనపల్లి క్రాస్ వద్ద కారులో వెళ్తున్న వీఆర్వోలను లారీ ఢీకొంది. ఈ ఘటనలో కారు ధ్వంసం కాగా తిరుపతి గ్రామీణ మండలానికి చెందిన వీఆర్వోలు బాబ్జి, యోగానంద స్వల్ప గాయాలతో బయటపడ్డారు. వారిని ఎమ్మెల్యే పులివర్తి నాని హుటాహుటిన ప్రైవేటు ఆసుపత్రికి తరలించి పరామర్శించారు.

నర్సుల సంఘం అధ్యక్షురాలిగా రాధమ్మ


డిక్లరేషన్ తీసుకుంటున్న ప్యానల్ సభ్యులు

తిరుపతి(వైద్యవిభాగం), న్యూస్‌టుడే: ప్రభుత్వ నర్సుల సంఘం ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షురాలిగా రాధమ్మ ఎన్నికయ్యారు. ఆరేళ్లుగా నర్సింగ్ అసోసియేషన్‌కు ఎన్నికలు జరగలేదు. మూడు వర్గాలు ఎవరికివారు తామే నాయకులమంటూ ప్రకటించుకుని.. అధికారుల వద్ద పైరవీలు చేసేవారు. దీంతో ప్రభుత్వం సంఘం గుర్తింపును పక్కన పెట్టింది. తాజా పరిస్థితిని ప్రభుత్వానికి విన్నవించుకోగా.. రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికల నిర్వహించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాకు సంబంధించిన నర్సింగ్ ఎన్నికలను కోఆపరేటివ్ సొసైటీ బుధవారం నిర్వహించింది. అధ్యక్షులుగా రాధమ్మ, కార్యదర్శిగా లీలావతి, కోశాధికారిగా ఎం.సర సుభాషిణి, ఉపాధ్యక్షులుగా రాణి, సభ్యులు వరలక్ష్మి, శివమ్మ, పద్మావతి, చంద్రావతి, హిమబిందు ఎన్నికయ్యారు.

ఉత్సాహంగా అంతర కళాశాలల పోటీలు


హాకీ విజేత ఎస్వీ ఆర్ట్స్ కళాశాల జట్టు

తిరుపతి (క్రీడలు): ఎస్వీయూ అంతర కళాశాలల పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. బుధవారం ఎస్వీ ఆర్ట్స్ కళాశాల ఆధ్వర్యంలో హాకీ, ఫుట్‌బాల్, షటిల్ బ్యాడ్మింటన్ పోటీలను నిర్వహించారు. తితిదే విద్యాశాఖాధికారి వై.నాగరాజు నాయుడు పోటీలను ప్రారంభించి మాట్లాడారు. విజేతలకు అతిథుల చేతుల మీదుగా ట్రోఫీ, ధ్రువపత్రాలను ప్రదానం చేశారు. ఎస్వీయూ వ్యాయామ విద్యావిభాగాధిపతి ఆచార్య శివశంకర్ రెడ్డి, ఎస్వీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ఎన్.వేణుగోపాల్ రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ పి.భాస్కరుడు, వ్యాయామ విద్యావిభాగాధిపతి ముస్తాక్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

ధర్మపరిరక్షణకు కృషి చేయాలి


అనుగ్రహ భాషణం చేస్తున్న విజయేంద్ర సరస్వతి

తిరుమల, న్యూస్‌టుడే: అన్ని విద్యల్లోకెల్లా వేదవిద్య ఉన్నతమైనదని కంచి కామకోటి పీఠాధిపతి శ్రీ విజయేంద్ర సరస్వతి అన్నారు. స్థానిక ధర్మగిరి వేదవిజ్ఞాన పీఠంలో బుధవారం వేదవిద్యార్థులకు అనుగ్రహభాషణం చేశారు. వేదవిద్యార్థులు ధర్మ పరిరక్షణకు కృషిచేయాలన్నారు. వేదవిద్యార్థులకు స్వరూపం, స్వధర్మం, స్వభావం ముఖ్యమని, ధర్మాన్ని తెలుసుకోవాలంటే వేదాలను తెలుసుకోవడం తప్పనిసరి అన్నారు. పీఠం ప్రిన్సిపల్ కుప్పా శివసుబ్రహ్మణ్యం అవధాని, ధర్మగిరి ప్రత్యేక అధికారిణి విజయలక్ష్మి పాల్గొన్నారు.

ముగిసిన జాతీయ సదస్సు

తిరుపతి (బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో మూడు రోజుల పాటు జరిగిన పంచాంగం నిర్మాణ జాతీయ సదస్సు బుధవారం ముగిసింది. ముఖ్యఅతిథిగా బ్రహ్మశ్రీ రాణి నరసింహమూర్తి, జ్యోతిశాస్త్ర విభాగ వరిష్టాచార్యులు ప్రొ.రాధాకాంత ఠాకూర్, విశ్వవిద్యాలయ ఉపకులపతి కృష్ణమూర్తి మాట్లాడారు. సమాజానికి ఉపయోగపడే పంచాంగం కోసం మేధోమథనం చేసినట్లు చెప్పారు. డీన్లు రజనీకాంత్ శుక్ల, కృష్ణేశ్వర ఝా, సమన్వయకర్తలు డా.చిత్తరంజన్ నాయక్, డా.కృష్ణ కుమార్ భార్గవ్, బాలాక్రామ్ సారస్వత్, డా.ధర్మదాసన్ పాల్గొన్నారు.